విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

పెన్ సత్తా


ప్రశ్నించడం అందరి హక్కు..

PEN SATTA Telugu Daily



సంపుటి : 4 | సంచిక :166 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | సోమవారం 2 నవంబర్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool



సిక్కుల గాయాలపై కాంగ్రెస్ మళ్లీ ఉప్పు చల్లింది!

- 1984 అల్లర్ల వార్షికోత్సవం రోజే ఢిల్లీలో ర్యాలీ ఎందుకు?
- కాంగ్రెస్, రాహుల్ గాంధీపై అమిత్ షా తీవ్ర విమర్శలు
- వేలాది మంది సిక్కులను సజీవ దహనం చేశారు
- బాధితులకు మోదీ ప్రభుత్వం న్యాయం చేసిందని వెల్లడి
- సోనియా గాంధీ ప్రధాని కల నెరవేరదంటూ వ్యాఖ్యలు

ఫలితాలపై ఉత్కంఠ!

- మున్సిపల్ ఎన్నికల ఓటింగ్ పూర్తి..
- ఏపీలో ముగిసిన మున్సిపల్ పోరు!
- 3న ఓట్ల లెక్కింపు.. అదే రోజు ఫలితాలు
- 92 పట్టణ స్థానిక సంస్థల్లో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్
- సాయంత్రం 5 గంటలకు క్యూలైన్‌లో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం
- విజయవాడ 55వ డివిజన్‌లో రెండున్నర గంటల అదనపు సమయం
- స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ఠ భద్రతకు ఏర్పాట్లు
- పోలింగ్ సరళిపై 12 జిల్లాల కలెక్టర్లతో ఎస్ఈసీ సమీక్ష



అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 92 పట్టణ స్థానిక సంస్థల్లో ఆదివారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 గంటలకు ముగిసింది. నిర్ణీత సమయానికి పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్‌లో ఉన్న ఓటర్లందరికీ ఓటు వేసే అవకాశం కల్పించారు. అక్కడక్కడా చెదురుమదురు ఘటనలు, ఫిర్యాదులు మినహా పోలింగ్ ప్రక్రియ సాధారణంగా సాగినట్లు అధికారులు వెల్లడించారు. ఈ నెల 3న ఓట్ల లెక్కింపు చేపట్టి, అదే రోజు ఫలితాలు ప్రకటించనున్నారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 55వ డివిజన్‌లో బ్యాలెట్ పేపర్‌పై గుర్తుల ముద్రణలో తలెత్తిన సమస్య కారణంగా పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. వివరాలు 2లో..

ఓటు వేయకుండానే వెనుదిరిగిన జగన్!



- పులివెందులలో రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్
- 70 పోలింగ్ కేంద్రాల్లో వైసీపీ ఏజెంట్లను అడ్డుకున్నారని ఆరోపణ
- ఆర్వో కార్యాలయం ఎదుట ఏజెంట్లతో కలిసి బైఠాయింపు
- ఎన్నికల ప్రక్రియను రద్దు చేసి మళ్లీ పోలింగ్ జరపాలని వినతి
- రీపోలింగ్ జరిగితేనే ఓటు వేస్తానని స్పష్టీకరణ

పులివెందుల

ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలింగ్ కేంద్రాల్లో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను అనుమతించలేదని, ఓటర్లను అడ్డుకున్నారని ఆరోపిస్తూ ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియ సక్రమంగా జరగడం లేదని ఆరోపిస్తూ తాను ఓటు వేయకుండానే వెనుదిరిగారు. పులివెందుల మున్సిపాలిటీలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. రీపోలింగ్ వివరాలు 2లో..



ప్రతి క్షణం యుద్ధానికి సిద్ధంగా ఉండాలి!

- వాయుసేనను మరింత బలోపేతం చేయడమే లక్ష్యం
- కొత్త చీఫ్ ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ స్పష్టీకరణ
- స్వదేశీ యుద్ధ విమానాలు, ఆయుధ వ్యవస్థలకు పెద్దపీట
- డ్రోన్లు, ఏఐ, సైబర్ దాడులను ఎదుర్కొనేలా సన్నద్ధత
- త్రివిధ దళాల మధ్య సమన్వయానికి ప్రత్యేక ప్రాధాన్యం

పట్టాలెక్కేందుకు భారత్ తొలి బుల్లెట్ రైలు సిద్ధం!

- వచ్చే ఏడాది మే-జూన్‌లో ట్రయల్ రన్..
- ఢిల్లీ-వారణాసి మధ్య 3.5 గంటల్లో ప్రయాణం
- స్వదేశీ బుల్లెట్ రైలు తయారీ దృశ్యాలు విడుదల
- పరీక్షల అనంతరం ప్రధాని చేతుల మీదుగా ప్రారంభం
- వడోదర-ముంబై ప్రయాణం గంటన్నరలోనే!





జ్ఞానేశ్ కుమార్‌కు జైలు తప్పదు!

- మోదీ, షాలకు పదవులు రావడానికి ఆయనే కారణం
- సీఈసీపై రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు.. ఎన్నికల వ్యవస్థను ధ్వంసం చేశారు
- ఓట్ల చోరీతోనే బీజేపీ విజయాలు సాధించిందని వ్యాఖ్య
- అదానీ ప్రయోజనాల కోసమే కేంద్రం పనిచేస్తోందని ఆరోపణ
- రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఇండియా కూటమి పిలుపు

అర్నబ్ తుపాను నష్టం

రూ.4,764 కోట్లు!



- కేంద్ర బృందానికి ప్రాథమిక నివేదిక అందించిన రాష్ట్ర ప్రభుత్వం
- 3.75 లక్షల హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలకు నష్టం
- 9 మంది మృతి.. 81 వేల మందికి పునరావాసం
- విద్యుత్ రంగానికి రూ.1,233 కోట్ల నష్టం
- రహదారుల పునరుద్ధరణకు రూ.1,623 కోట్లు అవసరం
- బాధితుల సహాయార్థం ఎస్‌బీఐ రూ.5.01 కోట్ల విరాళం

అమరావతి

అర్నబ్ అతితీవ్ర తుపాను ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. అక్టోబరు 26 నుంచి మూడు రోజుల పాటు 16 జిల్లాలపై ప్రభావం చూపిన తుపాను కారణంగా వివిధ రంగాలకు మొత్తం రూ.4,764 కోట్ల నష్టం వాటిల్లినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. ఈ మేరకు రూపొందించిన నివేదికను శనివారం కేంద్ర బృందానికి అందజేసింది. తుపాను కారణంగా వేర్వేరు ఘటనల్లో తొమ్మిది మంది మృతి చెందగా, లక్షలాది మంది ప్రజలు ప్రభావితమయ్యారు. వ్యవసాయం, ఉద్యానవనాలు, మత్స్య, విద్యుత్, రహదారులు, గృహ నిర్మాణం తదితర రంగాలకు వివరాలు 2లో..

రెచ్చగొట్టినా సంయమనం

కోల్పోవద్దు!

- కూటమి శ్రేణులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం
- పోలింగ్ శాతం పెంచేందుకు క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలి
- వృద్ధులు, దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకునేలా సహకరించాలి
- ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి
- అవాంఛనీయ ఘటనలపై వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలి



అమరావతి

స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ వేళ కూటమి శ్రేణులు సంయమనం పాటించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ప్రత్యర్థులు రెచ్చగొట్టేలా, కుట్రపూరితంగా వ్యవహరించే అవకాశం ఉందని, ఎట్టి పరిస్థితుల్లోనూ సహనం కోల్పోవద్దని స్పష్టం చేశారు. పోలింగ్ సరళి, క్షేత్రస్థాయిలో పరిస్థితులపై కూటమి పార్టీల ముఖ్యనేతలు, కార్యకర్తలతో ఆదివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన.. పోలింగ్ శాతం పెంచేందుకు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా జరుగుతోందని చంద్రబాబు తెలిపారు. గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలతో పోలిస్తే ఈసారి ప్రజల్లో మంచి స్ఫూర్తి కనిపిస్తోందన్నారు. కొన్ని మున్సిపాలిటీల్లో ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు వస్తుండగా, మరికొన్ని ప్రాంతాల్లో పోలింగ్ శాతం తక్కువగా ఉందని వివరాలు 2లో..



ఓటమిని జీర్ణించుకోలేక కుట్రలు!

- ఎన్నికల్లో ఓటమితో రాజ్యాంగ సంస్థలపై విమర్శలు
- రాహుల్ గాంధీపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ తీవ్ర ఆరోపణలు
- కాంగ్రెస్‌లో వంశపారంపర్య పాలన కొనసాగుతోందని విమర్శ
- 1984 సిక్కుల ఊచకోతపై కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్
- 'లోక్‌తంత్ర్ బచావో.. అరాచక్ హటావో' పేరుతో బీజేపీ పాదయాత్రలు

ఓట్ల చోరీతోనే బీజేపీ విజయాలు..

ఎన్నికల సంఘంపై ఇండియా కూటమి ధ్వజం!

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే తొలగించాలని డిమాండ్

మోదీని సాగనంపి రాజ్యాంగాన్ని కాపాడాలని ఖర్గే పిలుపు

ఓటు వేయకుండానే వెనుదిరిగిన జగన్!

-మొదటిపేజీ తరువాయి

జరిగినప్పుడే వచ్చి ఓటు వేస్తానని స్పష్టం చేశారు.

70 కేంద్రాల్లో ఏజెంట్లకు అనుమతి లేదంటూ..

పులివెందుల మున్సిపాలిటీలో మొత్తం 80 పోలింగ్ కేంద్రాలు ఉండగా, వైఎస్సార్‌సీపీకి చెందిన ఏజెంట్లను కేవలం పది కేంద్రాల్లోనే అనుమతించారని జగన్ ఆరోపించారు. మిగిలిన 70 కేంద్రాల్లో టీడీపీ కార్యకర్తలు తమ ఏజెంట్లను అడ్డుకుని, వారి అనుమతి పత్రాలను చించివేశారని పేర్కొన్నారు. తెల్లవారుజామునే కొన్ని పోలింగ్ కేంద్రాలను తమ ఆధీనంలోకి తీసుకున్నారని, ఓటర్లను భయపెట్టి వెనక్కి పంపించారని ఆరోపించారు. ఓటరు స్లిప్పులు లాక్కోవడం, ఓట్లు వేయకుండా అడ్డుకోవడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని అన్నారు. ఈ ఆరోపణలకు సంబంధించిన వీడియోలు, సీసీటీవీ ఫుటేజీలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు.

ఆర్వో కార్యాలయం ఎదుట బైఠాయింపు

పోలింగ్ కేంద్రాల్లో చోటుచేసుకున్న పరిణామాలపై ఫిర్యాదు చేసేందుకు జగన్ పులివెందుల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లారు. అయితే అధికారులు ఆయనను కార్యాలయంలోకి అనుమతించలేదని వైఎస్సార్‌సీపీ వర్గాలు తెలిపాయి. దీంతో కార్యాలయం వెలుపలే ఏజెంట్లు, పార్టీ నాయకులతో కలిసి ఆయన బైఠాయించి నిరసన తెలిపారు. బాధిత ఏజెంట్ల వాదనలు వినాలని, వారి నుంచి వ్యక్తిగతంగా వివరాలు సేకరించాలని రిటర్నింగ్ అధికారిని కోరారు. ఎన్నికల ప్రక్రియలో జరిగినట్లు చెబుతున్న అక్రమాలపై విచారణ జరిపి, న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

'నేను ఓటు వేయను.. రీపోలింగ్ జరిగినప్పుడే వస్తా'

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన జగన్.. ప్రస్తుత పరిస్థితుల్లో ఓటు వేయడం సమంజసం కాదని అన్నారు. "నేను ఓటు వేయను. ఇప్పుడు ఓటు వేస్తే ఎన్నికల ప్రక్రియ అంతా సక్రమంగా జరిగిందనే సంకేతం వెళ్తుంది. ఇక్కడ జరుగుతున్న పరిస్థితులు ప్రజలకు తెలియాలి. రీపోలింగ్ నిర్వహిస్తే తప్పకుండా వచ్చి ఓటు వేస్తా" అని స్పష్టం చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం, అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభావంలో పనిచేస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వా



మ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఈ వ్యవహారంపై న్యాయపోరాటం చేస్తామని, అవసరమైతే కోర్టును ఆశ్రయిస్తామని ప్రకటించారు.

రీపోలింగ్‌కు వినతిపత్రం

పులివెందుల మున్సిపాలిటీలోని మొత్తం 80 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియను రద్దు చేసి, తిరిగి ఎన్నికలు నిర్వహించాలని జగన్ రిటర్నింగ్ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఏజెంట్లను అడ్డుకున్న ఘటనలపై విచారణ జరపాలని, సీసీటీవీ ఫుటేజీలు, పోలింగ్ రికార్డులు భద్రపర చాలని కోరారు. బాధిత ఏజెంట్ల వాంగ్మూలాలు సమోదు చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల సంఘం ఏమందంటే?

జగన్ రీపోలింగ్ డిమాండ్‌పై రాష్ట్ర ఎన్నికల సంఘం స్పందించింది. పులివెందులలో జరిగిన ఘటనలపై జిల్లా కలెక్టర్, ఎస్పీ, సంబంధిత ఎన్నికల అధికారుల నుంచి నివేదికలు కోరినట్లు తెలిపింది. క్షేత్రస్థాయి నివేదికలు, అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలించిన తర్వాతే రీపోలింగ్‌పై నిర్ణయం తీసుకుంటామని ఎన్నికల సంఘం కమిషనర్ అనిల్ చంద్ర పునేతా వెల్లడించినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి. కేవలం ఆరోపణల ఆధారంగా నిర్ణయం తీసుకోలేమని, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

టీడీపీ వర్గాల నుంచి కూడా ఆరోపణలు

పులివెందులలో ఎన్నికల సందర్భంగా వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. మరోవైపు వైసీపీ శ్రేణులు ఓటర్లను భయపెట్టాయని, పోలింగ్‌కు ఆటంకం కలిగించాయని టీడీపీ వర్గాలు ఆరోపించాయి. ఈ పరస్పర ఆరోపణల నేపథ్యంలో ఎన్నికల సంఘం విచారణ నివేదికలపై ఆసక్తి నెలకొంది. రీపోలింగ్ నిర్వహణపై అధికారిక నిర్ణయం వెలువడాల్సి ఉంది.

హెలికాప్టర్ ల్యాండ్ కాకూడదని 'కూటమి' కుట్ర

పులివెందులలో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హెలికాప్టర్ ల్యాండింగ్‌కు చంద్రబాబు సర్కార్ ఆటంకాలు సృష్టించిన సంగతి తెలిసిందే. కూటమి సర్కార్ కుట్రలపై స్పందించిన వైఎస్ జగన్.. పులివెందులలో హెలికాప్టర్ ల్యాండ్ కాకూడదని కుట్ర పన్నారని.. తప్పనిసరి పరిస్థితుల్లో హెలికాప్టర్ ల్యాండ్ అయ్యిందన్నారు. ప్రజలను రక్షించాల్సినవారే భక్షిస్తే ఎలా?" అంటూ వైఎస్ జగన్ ప్రశ్నించారు. "కళ్లెదుటే గూండాలు కనిపిస్తున్నా పోలీసుల చర్యల్లేవు. సుప్రీంకోర్టు ఆదేశాలను ఎస్ఈసీ పాటించడం లేదు. బూత్‌ల్లో వీడియో రికార్డింగ్, సీసీ కెమెరాలు లేవు. వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు లేకుండా ఎన్నికలు ఎలా నిర్వహిస్తారు. ఏజెంట్లు లేకుండా ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నిస్తాం. రీ పోలింగ్ జరపాలని ఆర్వోను కోరతాం. ..యథేచ్ఛగా దొంగ ఓట్లు వేస్తున్నారు. ఎస్పీలు, కలెక్టర్లకు ఫోన్ చేసినా స్పందన లేదు. వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు లేకుండా ఎన్నికలు ఎలా నిర్వహిస్తారు?. వచ్చిన ఓటర్లను పోలీసులే వెనక్కి పంపుతున్నారు. ఇది ప్రజాస్వామ్యమేనా?. పులివెందులలో జరుగుతున్న ఘటనలే ఇందుకు నిదర్శనం" అంటూ వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

అర్నబ్ తుపాను నష్టం రూ.4,764 కోట్లు!

-మొదటిపేజీ తరువాయి

జరిగిన నష్టాన్ని నివేదికలో వివరించింది.

ఎల్‌నినో ప్రభావంతో ఇప్పటికే ప్రతికూల పరిస్థితుల్లో సాగు చేస్తున్న రైతులకు అర్నబ్ తుపాను తీవ్ర నష్టాన్ని కలిగించింది. రాష్ట్రవ్యాప్తంగా 2,253 గ్రామాల్లో 3.33 లక్షల హెక్టార్లలో వ్యవసాయ పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేశారు. సుమారు 2.70 లక్షల ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. మొత్తం 4.63 లక్షల మంది రైతులకు పెట్టుబడి రాయితీ కింద రూ.520 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని నివేదికలో పేర్కొన్నారు.

ఉద్యాన పంటలకూ నష్టం

216 మండలాల పరిధిలోని 1,318 గ్రామాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. 80,822 మంది రైతులకు చెందిన 23,383 హెక్టార్లలో కొబ్బరి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఉద్యాన పంటల రైతులకు రూ.739 కోట్ల పెట్టుబడి రాయితీ అవసరమని అంచనా వేశారు. 15,600 హెక్టార్లలో అరటి, 4,036 హెక్టార్లలో కూరగాయలు, 1,243 హెక్టార్లలో కొబ్బరి, 716 హెక్టార్లలో బొప్పాయి పంటలు దెబ్బతిన్నట్లు నివేదికలో వివరించారు.

మత్స్య, పశుసంపద రంగాలపై ప్రభావం

తుపాను కారణంగా ఎనిమిది జిల్లాల్లో 2,366 పడవలు ధ్వంసమయ్యాయి. 3,308 వలలు దెబ్బతిన్నాయి. 4,795 హెక్టార్లలో ఆక్వా చెరువులకు నష్టం వాటిల్లింది. పశ్చిమగోదావరి జిల్లాలో రూ.70.46 కోట్లు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రూ.12 కోట్ల మేర నష్టం జరిగినట్లు అధికారులు గుర్తించారు. పది జిల్లాల్లో 272 పశువులు మృతి చెందగా, వాటి యజమానులకు రూ.1.52 కోట్ల పరిహారం చెల్లించాల్సి ఉంటుందని నివేదికలో పేర్కొన్నారు.

948 గ్రామాలపై తీవ్ర ప్రభావం

గుంటూరు నుంచి శ్రీకాకుళం వరకు 16 జిల్లాల్లోని 948 గ్రామాలపై తుపాను తీవ్ర ప్రభావం చూపింది. మొత్తం 6,00,257 మంది ప్రభావితమయ్యారని అధికారులు కేంద్ర బృందానికి వివరించారు. ముందస్తు చర్యల్లో భాగంగా 81,306 మందిని పునరావాస శిబిరాలకు తరలించారు. తీవ్ర గాలుల కారణంగా 6,659 ఇళ్లు దెబ్బతినగా, రూ.16.51 కోట్ల మేర నష్టం వాటిల్లింది. వీటిలో ఒక్క కోనసీమ జిల్లాలోనే 6,328 ఇళ్లు దెబ్బతిన్నట్లు నివేదిక వెల్లడించింది.

విద్యుత్ రంగానికి రూ.1,233 కోట్ల నష్టం

తుపాను తీరం దాటే సమయంలో వీచిన బలమైన గాలుల



కారణంగా విద్యుత్ వ్యవస్థకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈపీడీసీఎల్ పరిధిలోని 4,999 గ్రామాలు, సీపీడీసీఎల్ పరిధిలోని 1,267 గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మొత్తం 31.46 లక్షల గృహ, వాణిజ్య, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లపై ప్రభావం పడింది. విద్యుత్ రంగానికి రూ.1,233 కోట్ల నష్టం వాటిల్లినట్లు రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది.

రోడ్ల మరమ్మతులకు రూ.1,623 కోట్లు

రహదారులు, భవనాల శాఖ పరిధిలో 2,448 కిలోమీటర్ల రహదారులు దెబ్బతిన్నాయి. 2,188 చెట్లు నేలకొరిగాయి. 129 ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పశ్చిమగోదావరి జిల్లాలో 552 కిలోమీటర్లు, కోనసీమ జిల్లాలో 396 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నాయి. తాత్కాలిక, శాశ్వత పునరుద్ధరణ పనులకు రూ.1,439 కోట్లు అవసరమని అంచనా వేశారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో మరో 917 కిలోమీటర్ల రహదారులు దెబ్బతినగా, వాటి మరమ్మతులకు రూ.184.60 కోట్లు అవసరమని తెలిపారు.

ఇతర రంగాలకూ నష్టం

తుపాను ప్రభావంతో 70 తాగునీటి పథకాలు దెబ్బతిన్నాయి. 98 పాఠశాల భవనాలకు నష్టం వాటిల్లగా, మరమ్మతులకు రూ.9.86 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. 853 గ్రామ పంచాయతీల్లో 602 చోట్ల డ్రెయిన్లు మూసుకుపోగా, 2,542 బృందాలతో పారిశుద్ధ్య పనులు చేపట్టి అడ్డంకులను తొలగించారు. చిన్న నీటిపారుదల శాఖ పరిధిలో 62 చెరువులు, ఏడు కాల్వలకు గండ్లు పడ్డాయి. ఆరోగ్య కేంద్రాలు, ప్రాంతీయ, జిల్లా ఆసుపత్రులు, వైద్య కళాశాల భవనాలతోపాటు 61 అంగన్‌వాడీ భవనాలు దెబ్బతిన్నాయి. ఈ రంగాల్లో మొత్తంగా రూ.20 కోట్ల నష్టం జరిగినట్లు గుర్తించారు. పట్టణ ప్రాంతాల్లో 29,440 మంది ప్రజలు ప్రభావితమయ్యారు. 9,237 వీధి దీపాలు దెబ్బతిన్నాయి. 20 కిలోమీటర్ల మేర రహదారులకు నష్టం వాటిల్లగా, పునరుద్ధరణ పనులకు రూ.48.40 కోట్లు అవసరమని నివేదికలో పేర్కొన్నారు.

సీఎం సహాయనిధికి ఎస్‌బీఐ రూ.5.01 కోట్లు

అర్నబ్ తుపాను బాధితులను ఆదుకునేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) అమరావతి సర్కిల్ ఉద్యోగులు ముందుకొచ్చారు. తమ ఒక రోజు వేతనమైన రూ.5.01 కోట్లను ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళంగా అందించారు. ఎస్‌బీఐ ఎండీ అమర రామ్‌మోహన్‌రావు నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి చెక్కును అందజేసింది. ఈ సందర్భంగా విరాళం అందించిన ఎస్‌బీఐ ఉద్యోగులకు సీఎం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రాప్తాడు ఘటనలో కీలక పరిణామం.. నిందితుడు హేమంత్ పై పోలీసుల కాల్పులు

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రాప్తాడు పాఠశాల విద్యార్థినిపై దాడి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. పరారీలో ఉన్న నిందితుడు హేమంత్‌పై పోలీసులు కాల్పులు జరిపారు. పోలీసుల కథనం ప్రకారం.. ఆత్మకూరు సమీపంలోని అటవీ ప్రాంతంలో నిందితుడిని పట్టుకునేందుకు ప్రయత్నించగా, అతను పోలీసులపై రాళ్లతో దాడికి యత్నించాడు. దీంతో ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. తీవ్రంగా గాయపడిన హేమంత్‌ను అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

వివరాల్లోకి వెళితే...

రాప్తాడు మండలం అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థినిపై ఆమె బంధువైన హేమంత్ దారుణంగా దాడి చేసిన విషయం తెలిసిందే. రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని తరగతి గదిలోకి ఎలక్ట్రిక్ రంపంతో (చైన్‌సా) ప్రవేశించిన హేమంత్.. బాలిక తల, ముఖం, వీపు భాగాలపై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఆమెను కాపాడేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థిని కాళ్లకు కూడా



తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం నిందితుడు రంపాన్ని అక్కడే పడిలేసి పరారయ్యాడు. తీవ్ర గాయాలపాలైన బాలికను తొలుత అనంతపురం ఆసుపత్రికి, ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆమె ప్రస్తుతం మణిపాల్ ఆసుపత్రిలోని పీఐసీయూలో చికిత్స పొందుతోంది. ఈ కేసును సవాలుగా స్వీకరించిన పోలీసులు, నిందితుడి కోసం గాలింపు ముమ్మరం చేశారు. హేమంత్ ఆత్మకూరు సమీపంలోని అడవుల్లో దాక్కున్నట్లు సమాచారం అందడంతో, ప్రత్యేక బృందాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. లొంగిపోవాలని పోలీసులు సూచించినప్పటికీ, హేమంత్ వారిపైకి రాళ్లు విసురుతూ తప్పించుకునేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో కొందరు సిబ్బందికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో పోలీసులు ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపారు. సుమారు ఆరు రౌండ్ల కాల్పులు జరిపినట్లు సమాచారం. బుల్లెట్ గాయాలతో కుప్పకూలిన హేమంత్‌ను పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకుని చికిత్స నిమిత్తం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

ఫలితాలపై ఉత్కంఠ!



-మొదటిపేజీ తరువాయి

దీంతో ఎన్నికల సంఘం అక్కడ పోలింగ్ సమయాన్ని పొడిగించింది. ఓటర్లకు ఇబ్బంది కలగకుండా అదనంగా రెండున్నర గంటల సమయం కేటాయించింది. ఈ డివిజన్‌లో పోలింగ్ ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

12 జిల్లాల కలెక్టర్లతో సమీక్ష

పోలింగ్ సరళిపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేతా సమీక్ష నిర్వహించారు. విజయవాడలో మీడియాతో మాట్లాడిన ఆయన.. వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ ప్రక్రియను ఎప్పటికప్పుడు పరిశీలించినట్లు తెలిపారు. జిల్లాల పరిశీలకులతో పాటు 12 జిల్లాల కలెక్టర్లతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించినట్లు వెల్లడించారు. ఈ జిల్లాల్లో ఎక్కువగా రాయలసీమ ప్రాంతానికి చెందినవే ఉన్నాయని చెప్పారు. కొన్ని జిల్లాల నుంచి చిన్నచిన్న ఫిర్యాదులు అందగా, మరికొన్ని జిల్లాల్లో ఎలాంటి ఫిర్యాదులు రాలేదన్నారు.

ఫిర్యాదులపై నివేదికల ఆధారంగానే చర్యలు

ఎన్నికల సంఘం తటస్థంగా వ్యవహరిస్తోందని పునేతా స్పష్టం చేశారు. కలెక్టర్లు పంపించే నివేదికలు, అందుబాటులో ఉన్న ఆధారాల ఆధారంగానే చర్యలు తీసుకుంటామని తెలిపారు. విజయవాడ 55వ డివిజన్‌లో బ్యాలెట్ పేపర్ ముద్రణ సమస్యను గుర్తించి అదనపు సమయం ఇచ్చినట్లు చెప్పారు. పోలింగ్ శాతంపై పూర్తి వివరాలు మరుసటి రోజు వెల్లడిస్తామని పేర్కొన్నారు. 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 63.6 శాతం పోలింగ్ నమోదైనట్లు గుర్తుచేశారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత

పోలింగ్ ముగిసిన ప్రాంతాల్లో బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. బ్యాలెట్ బాక్సులు భద్రపరిచే కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రత కల్పిస్తామని ఎన్నికల కమిషనర్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

పులివెందుల ఘటనపై నివేదిక కోరాం

పులివెందులలో చోటుచేసుకున్న ఘటనలపై ఎస్పీతో మాట్లాడినట్లు పునేతా తెలిపారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, ఎస్పీ నుంచి నివేదికలు అందిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆధారాలు లేకుండా ఎలాంటి చర్యలు తీసుకోలేమని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారమే పనిచేస్తుందని పేర్కొన్నారు.

275 ఎఫ్ఐఆర్‌లు నమోదు

మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు మొత్తం 275 ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్లు శాంతిభద్రతల ఐజీ రాజకుమారి వెల్లడించారు. పోలింగ్ రోజున మొత్తం 40 ఘటనలు తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. వాటిని పరిశీలించి, అవసరమైన చోట కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ఎన్నికల ప్రక్రియలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ అప్రమత్తంగా పనిచేసిందని వివరించారు.

రెచ్చగొట్టినా సంయమనం కోల్పోవద్దు!

-మొదటిపేజీ తరువాయి

పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు.

వృద్ధులు, దివ్యాంగులకు సహకరించాలి

వృద్ధులు, దివ్యాంగులు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటు వేసేందుకు అవసరమైన సహకారం అందించాలని కూటమి నేతలకు సీఎం సూచించారు. ఎన్నికల నిబంధనలకు లోబడి ఓటర్లను చైతన్యపరచాలని, పోలింగ్ శాతం పెరిగేలా క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

అవాంఛనీయ ఘటనలపై అప్రమత్తం

ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటే వెంటనే ఎన్నికల అధికారులు, పోలీసుల దృష్టికి తీసుకెళ్లాలని చంద్రబాబు సూచించారు. ప్రత్యర్థులు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేసినా కార్యకర్తలు శాంతియుతంగా వ్యవహరించాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

ఉత్తరాంధ్రలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతం

- ఆ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం అధికం

ఉత్తరాంధ్రలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా సాగింది. విశాఖ, విజయనగరం, అనకాపల్లి, మన్యం, శ్రీకాకుళం జిల్లాలో ఓటర్ల చైతన్యం కనిపించింది. అనకాపల్లి, మన్యం జిల్లా పరిధిలో కొన్నిచోట్ల ఓటింగ్ శాతం అధికంగా నమోదైంది. ఓటర్లు పెద్దసంఖ్యలో వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, కొత్త ఓటర్లు ఉత్సాహంగా వచ్చి ఓటు వేశారు. ఉత్తరాంధ్ర ప్రజాప్రతినిధులు కుటుంబసమేతంగా వచ్చి క్యూలైన్‌లో నిల్చొని ఓటు వేశారు. విశాఖ జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా సాగింది. విశాఖ, మధురవాడ, భీమునిపట్నం, గోపాలపట్నం, పెందుర్తిలో ఓటు వేసేందుకు ఉదయం నుంచి ఓటర్లు బారులు తీరడంతో పోలింగ్ కేంద్రాల వద్ద సందడి నెలకొంది. ఎలాంటి గొడవలు జరగకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. విశాఖ 5 రోడ్ల కూడలిలో కుటుంబ సభ్యులతో కలిసి సభాపతి అయ్యన్న పాత్రుడు, రాజ్యసభ సభ్యుడు విజయ్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్పీకర్ అయ్యన్న ప్రజలతో కలిసి క్యూలైన్‌లోనే వెళ్లి ఓటు వేశారు. గాజువాక హైస్కూల్ రోడ్డు ఎంపీ పాఠశాలలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఓటు వేశారు. విశాఖ రామ్‌నగర్‌లో ఎంపీ శ్రీభరత్ భార్య తేజస్వినితో కలిసి ఓటు వేశారు.

క్యూలైనులో వెళ్లి : ఉత్తర నియోజకవర్గంలో బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తన ఓటు వేశారు. గోపాలపట్నంలో జెడ్?పీ హైస్కూల్‌లో కుటుంబసమేతంగా ఎమ్మెల్యే గణబాబు ఓటు వేశారు. పెందుర్తి 115వ వార్డులో ఎమ్మెల్యే రమేశ్? బాబు క్యూలైనులో వెళ్లి ఓటు వేశారు. విశాఖ ఎన్?టీ కాలేజీ పోలింగ్ బూత్‌లో టీడీపీ మేయర్ అభ్యర్థి ముక్కా శ్రీవాణి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఏయూ ఇంగ్లీష్ మీడియం స్కూల్ పోలింగ్ కేంద్రంలో వైఎస్సార్సీపీ మేయర్ అభ్యర్థి పరుదు కల్యాణి ఓటు వేశారు. ఓటు వేసేందుకు వచ్చిన వృద్ధులకు పోలీసు సిబ్బంది వీల్‌చైర్ల ద్వారా పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లారు. మధురవాడ జోన్‌లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను క్రైం ఏడీసీపీ రమ్య పరిశీలించారు. అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లో పురపోరు పోలింగ్ ప్రశాంత వాతావరణంలో ముగిసింది. జీవీఎంసీలో భాగమైన అనకాపల్లి జోన్‌లోని ఆరు డివిజన్లు, నర్సీపట్నం పురపాలక పరిధిలో పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. యలమంచిలిలో భారీగా ఓటింగ్ శాతం నమోదయ్యింది. పెద్దపల్లి పోలింగ్ బూత్‌లో వైఎస్సార్సీపీ ఛైర్‌పర్సన్ అభ్యర్థి తులసి ఓటు వేశారు. అనకాపల్లి పట్టణంలో 95 ఏళ్ల వృద్ధురాలు పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేశారు. విజయనగరం కార్పొరేషన్‌తో పాటు బొబ్బిలి మున్సిపాలిటీ, నెల్లిమర్ల నగర పంచాయితీలో యువత, ప్రజలు, వృద్ధులు పెద్ద ఎత్తున తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కంటోన్మెంట్‌లోని ప్రభుత్వ పాఠశాల పోలింగ్ బూత్ వద్ద 53వ డివిజన్ కార్పొరేటర్ టీడీపీ అభ్యర్థి అనురాధ పలు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. వైఎస్సార్సీపీ నేతలు దొంగ ఓట్లు వేస్తున్నారని ఆరోపించారు. ఆమె ఆరోపణలు పోలీసులు తోసిపుచ్చారు. విజయనగరంలో ఓటు వేసిన ఎమ్మెల్యే అదితి కొన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ భారీ బైక్ ర్యాలీలో యార్లగడ్డ.





- ఆరుగొలను నుంచి మల్లవల్లి వరకు కొనసాగిన బైక్ ర్యాలీ.
- గన్నవరం నియోజకవర్గంలో మూడు పార్టీలూ ఐక్యంగా పనిచేస్తున్నాయి.
- కూటమి సీట్ల సర్దుబాటులో ఎలాంటి విభేదాలు లేవు యార్లగడ్డ.
- ప్రజాస్వామ్యబద్ధంగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుగుతాయి.
- జనసేనకు 17, బీజేపీకి నాలుగు ఎంపీటీసీ స్థానాలు కేటాయింపు.
- స్థానిక సంస్థల ప్రతినిధులు గెలిస్తే గ్రామాల సమస్యల పరిష్కారానికి అవకాశం.
- ప్రజలు ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించు కోవాలి యార్లగడ్డ.
- టీడీపీకి సైకిల్, జనసేనకు గాజు గ్లాసు, బీజేపీకి కమలం గుర్తు పై ఓటేయాలి.
- మూడు పార్టీల సమష్టి కృషితో అత్యధిక స్థానాలు గెలుస్తాం యార్లగడ్డ.

గన్నవరం, పెన్ సత్తా, నవంబర్ 01: నియోజకవర్గంలో ఎన్డీఏ కూటమి లోని మూడు పార్టీలు ఒకే కుటుంబంలా పనిచేస్తున్నాయని, సీట్ల సర్దుబాటులో ఎలాంటి అభిప్రాయ భేదాలు లేవని ఏపీ ప్రభుత్వ విప్ గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బాపులపాడు మండలంలో ఎన్డీఏ కూటమి జడ్పీటీసీ అభ్యర్థి చింతల వెంకట శివ అప్పారావుతో పాటు, ఎంపీటీసీ స్థానాల్లో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆరుగొలను గ్రామం నుంచి ప్రారంభ మైన ఈ ర్యాలీలో ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తొలుత ఆరుగొలను సెంటర్‌లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆరుగొలను, కానుమోలు, పెరికీడు, బాపులపాడు, వీరవల్లి, కోడూరుపాడు, శోభనాద్రిపురం, రంగన్నగూడెం, సింగన్నగూడెం మీదుగా మల్లవల్లి వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ నవంబరు 5 న జరగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించామని, ఒకేరోజు 11 నుంచి 12 గ్రామాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. గన్నవరం నియోజకవర్గంలో ఎన్డీఏ కూటమి లోని మూడు పార్టీలు ఎన్నికలకు ముందునుంచే ఐక్యంగా పనిచేస్తున్నాయని, సీట్ల సర్దుబాటులో ఎలాంటి అభిప్రాయ భేదాలు లేవని స్పష్టం చేశారు. రాష్ట్రం లోని ఇతర నియోజకవర్గాల్లో సీట్ల కేటాయింపు పై విభేదాలు ఉన్నట్లు వార్తలు వచ్చినప్పటికీ గన్నవరంలో మూడు పార్టీలు ఒకే కుటుంబంలా పనిచేశాయని చెప్పారు. గత తొమ్మిదేళ్లుగా సొంత కష్టార్జితాన్ని రాజకీయాల కోసం ఖర్చు చేస్తూ రాజీలేని పోరాటం చేస్తున్నానని యార్లగడ్డ తెలిపారు. రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్నప్పటికీ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరగాలన్నదే తన అభిమతమన్నారు. 2019 ఎన్నికల్లో బెదిరింపులు, పోలీసు కేసులు, ఘర్షణలు చోటుచేసుకున్నాయని, 2024 ఎన్నికల సమయంలోనూ సూరంపల్లి, తేలప్రోలు తదితర ప్రాంతాల్లో గొడవలు జరిగిన విషయాలను మీడియా గుర్తు చేయాలని అన్నారు. ప్రస్తుతం గన్నవరం నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తున్నామని, ప్రజల పై నమ్మకంతోనే ఎన్నికల బరిలోకి దిగామని పేర్కొన్నారు. గతంలో మాజీ ఎమ్మెల్యే అనుసరించిన విధానాలకు భిన్నంగా తాను ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యవహరిస్తున్నానని, చెప్పే మాటలకు చేసే పనులకు పొంతన ఉండాలని అన్నారు. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల విస్తరణతో ఎవరు ఏం మాట్లాడారు, ఏం చేశారన్నది ప్రజలకు స్పష్టంగా తెలుస్తోందని తెలిపారు. గన్నవరం నియోజకవర్గంలో మొత్తం 91 ఎంపీటీసీ స్థానాలు, నాలుగు జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయని, అన్ని స్థానాల్లో వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు వేసే అవకాశం కల్పించామని చెప్పారు. ప్రత్యర్థులు కూడా ప్రజాస్వామ్యబద్ధంగా పోటీ చేసి గెలిస్తేనే పార్టీల బలాబలాలు తెలుస్తాయని, ఏకగ్రీవాల ద్వారా ఫలితాలను నిర్ణయించు కోవడం తన విధానం కాదన్నారు. తనను ఇబ్బంది పెడుతున్నారని, బ్యాంకు ఖాతాలను నిలిపివేశారని వైసీపీ నాయకులు చేస్తున్న ప్రచారాన్ని నమ్మవద్దని కోరారు. గతంలోనూ ఇలాంటి ఆరోపణలు చేశారని గుర్తు చేశారు. తన ఆస్తులు, వ్యాపారాల వివరాలతో పాటు గత 27 ఏళ్ల అమెరికా పన్ను రిటర్నులను అవసరమైతే మీడియా సమక్షంలో, ప్రభుత్వానికి చూపించేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. గత తొమ్మిదేళ్లుగా స్వయంకృషితో సంపాదించిన డబ్బునే నియోజకవర్గ రాజకీయాల కోసం ఖర్చు చేశానని, ఎంపీల నుంచి కానీ, ఇతర పార్టీల వ్యక్తుల నుంచి కానీ చందాలు తీసుకోలేదని స్పష్టం చేశారు. మాజీ మంత్రి కొడాలి నాని, మాజీ ఎమ్మెల్యే వంశీకి రూ.10 వేల కోట్ల ఆస్తులున్నాయని చెప్పారని ప్రస్తావిస్తూ, అంత పెద్ద మొత్తంలో ఆస్తులు ఎలా సంపాదించారో ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని యార్లగడ్డ అన్నారు. అలాంటి వారు డబ్బులు పంచితే తీసుకోవాలని, ఓటు మాత్రం ఎన్డీఏ కూటమి అభ్యర్థులకే వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గన్నవరం నియోజకవర్గం లోని నాలుగు జడ్పీటీసీ స్థానాల్లో రెండింటిని బీజేపీకి కేటాయించామని, 17 ఎంపీటీసీ స్థానాలను జనసేనకు, నాలుగు స్థానాలను బీజేపీకి ఇచ్చామని వివరించారు. రాష్ట్రంలో బీజేపీకి 50 శాతం జడ్పీటీసీ స్థానాలు కేటాయించిన ఏకైక నియోజకవర్గం గన్నవరం అని తెలిపారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి తన నియోజకవర్గంలో మూడు జడ్పీటీసీ స్థానాలను, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తన నియోజకవర్గంలో ఐదింటికి రెండు స్థానాలను బీజేపీకి కేటాయించగా, గన్నవరంలో నాలుగింటికి రెండు స్థానాలు ఇచ్చామని చెప్పారు. ఇది బీజేపీ అభ్యర్థుల పై, కూటమి నాయకుల పై, ముఖ్యంగా గన్నవరం ప్రజల పై తనకున్న విశ్వాసానికి నిదర్శనమన్నారు. బీజేపీ అభ్యర్థులకు ఎన్నికల గుర్తులు తెలియవని కొందరు చేస్తున్న ప్రచారాన్ని తప్పుబట్టారు. గతంలో రెండుసార్లు స్వతంత్ర అభ్యర్థులను సైతం గెలిపించిన రాజకీయ చైతన్యం గల ప్రజలు గన్నవరంలో ఉన్నారని, ఎన్నికల గుర్తులను గుర్తించి సరైన నిర్ణయం తీసుకోగలరని అన్నారు. బాపులపాడు మండలంలో కూటమి అభ్యర్థులకు మంచి ఆదరణ ఉందని యార్లగడ్డ తెలిపారు. బాపులపాడు మండలం పై తనకు ప్రత్యేక అభిమానం ఉందని, జడ్పీటీసీ అభ్యర్థి చింతల వెంకటశివ అప్పారావును తనకు మండలంలో వచ్చిన మెజారిటీ కంటే ఎక్కువ మెజారిటీతో గెలిపించాలని కోరారు. పెరికీడు ఎంపీటీసీ అభ్యర్థిని కూడా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మల్లవల్లి పారిశ్రామిక ప్రాంత అభివృద్ధికి అశోక్‌ల్యాండ్ వంటి పరిశ్రమలను తీసుకొచ్చామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ప్రజలు స్వేచ్ఛగా జీవించే పరిస్థితులు ఏర్పడ్డాయని, గతంలో ఫోన్‌లో మాట్లాడటానికే భయపడే పరిస్థితి నుంచి ప్రస్తుతం స్వేచ్ఛగా మాట్లాడుకునే వాతావరణం వచ్చిందని యార్లగడ్డ అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని కూడా క్రమంగా గాడిలో పెడుతున్నామని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్ శాఖ ద్వారా గ్రామాల అభివృద్ధికి, మంత్రి నారా లోకేష్ పరిశ్రమలు, ఐటీ రంగాల్లో పెట్టుబడుల సాధనకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు ప్రజల మద్దతు అవసరమన్నారు. స్థానిక సంస్థల ప్రతినిధులు గెలిస్తే గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకొచ్చి త్వరగా పరిష్కరించేందుకు వీలవుతుందని తెలిపారు. గన్నవరం, కేసరపల్లి ప్రాంతాల్లో చెత్త సేకరణ వాహనాల ద్వారా సమస్యను పరిష్కరించామని చెప్పారు. స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారం ఉంటే గ్రామాల్లో మరిన్ని సమస్యలను పరిష్కరించవచ్చన్నారు. ఇప్పటివరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో తన బృందాన్ని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసుకోలేదని, ఈ ఎన్నికల ద్వారా గ్రామస్థాయిలో తన బృందాన్ని సిద్ధం చేసుకుంటున్నానని తెలిపారు. కూటమి అభ్యర్థులను గెలిపిస్తే ప్రజల సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చే అవకాశం ఉంటుందని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. గతంలో మాదిరిగా ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల వద్ద గొడవలు జరగకుండా చూస్తానని స్పష్టం చేశారు. ప్రజలు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్యంలో ఓటు కంటే గొప్ప ఆయుధం మరొకటి లేదని యార్లగడ్డ అన్నారు. టీడీపీ అభ్యర్థులకు సైకిల్ గుర్తుపై, జనసేన అభ్యర్థులకు గాజు గ్లాసు గుర్తుపై, బీజేపీ అభ్యర్థులకు కమలం గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, బీజేపీ నాయకత్వానికి గన్నవరం నియోజకవర్గ ప్రజల ఐక్యతను, కూటమి బలాన్ని చాటాలని పిలుపునిచ్చారు. మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తున్నారని, వారి సమష్టి కృషితో ఈ ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.



పోలింగ్ ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్.







- ఎంజీఎం పాఠశాల, బీవీకే కళాశాల పోలింగ్ కేంద్రాల తనిఖీ.
- సిటీ ఆపరేషన్ సెంటర్ నుంచి 10 జోన్లలో ఎన్నికల నిర్వహణ పై సమీక్ష.

విశాఖపట్నం, పెన్ సత్తా, నవంబర్ 01: గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ రెండో సాధారణ ఎన్నికల నేపథ్యంలో నగర పరిధి లోని 10 జోన్లు, 120 వార్డుల్లో జరిగిన పోలింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తో కలిసి ఎంజీఎం పాఠశాల, బీవీకే కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల నిర్వహణ తీరును, పోలింగ్ సరళిని పరిశీలించారు. జీవీఎంసీ సిటీ ఆపరేషన్ సెంటర్ నుంచి నగరవ్యాప్తంగా జరుగుతున్న పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. పది జోన్ల నోడల్ అధికారులు, జోనల్ అధికారులు, రూట్ అధికారులతో మాట్లాడి ఆయా ప్రాంతాల్లో పోలింగ్ పరిస్థితులను తెలుసుకున్నారు. ప్రతి రెండు గంటలకు ఓటింగ్ సరళి పై నివేదికలు సమర్పించాలని సిటీ ఆపరేషన్ సెంటర్ ఇన్‌చార్జి అధికారులు ఏడీసీ వర్మ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ యోగితలను ఆదేశించారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసర మైన సదుపాయాలు కల్పించాలని, పోలింగ్ ప్రశాంతంగా, సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. క్షేత్ర స్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన సమాచారాన్ని నిరంతరం నివేదించాలని ఆదేశించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపు రాష్ట్ర అభివృద్ధికి మలుపు.

- మోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ల సారథ్యంలో దేశంలో నెంబర్ వన్ గా ఆంధ్రప్రదేశ్.
- ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో విపత్తు నిర్వహణ దేశానికే ఆదర్శం.
- జగన్ హయాంలో ఏసీ రూముల నుంచి కదలకుండా విపత్తుల సమయంలో ప్రజల్ని గాలికి వదిలేసారు.
- రావులపాలెం మండలంలో కూటమి అభ్యర్థుల ప్రచారంలో ఎమ్మెల్యే బండారు.





కొత్తపల్లి, పెన్ సత్తా, నవంబర్ 01:స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి గెలుపు రాష్ట్ర అభివృద్ధికి మేలి మలుపుగా మారనుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు వ్యాఖ్యానించారు. ఆదివారం జరిగిన రావులపాలెం మండలం జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల ఎన్నికల ప్రచారంలో కొత్తపేట జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్, భాజపా నాయకులు తమలంపూడి రామకృష్ణా రెడ్డి, తదితరులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రావులపాలెం మండలం లోని జడ్పీటీసీ స్థానం, 24 ఎంపీటీసీ స్థానాలకు జరుగుతున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, భాజపా అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించి రాష్ట్ర అభివృద్ధికి ప్రజలు చేయూతనందించాలన్నారు. గత రెండున్నర ఏళ్లలో రావులపాలెం మండలంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ఆయన ప్రజలకు వివరించారు. గ్రామ గ్రామాన అభివృద్ధి కార్యక్రమాలు పరుగులు పెడుతున్నాయన్నారు. గ్రామీణ అభివృద్ధికి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎంతగానో కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఇక విపత్తుల నిర్వహణ అంశంలో దేశం లోనే ఉత్తమ నాయకుడిగా చంద్రబాబు నిలుస్తారని కొనియాడారు. గతంలో విశాఖను కుదిపేసిన హుదూద్ తుపాను మొదలుకుని, మొన్నటి విజయవాడ వరదల వరకు ఆయన ప్రదర్శించిన విపత్తు నిర్వహణ తీరు దేశానికే ఆదర్శం అన్నారు. తాజాగా రాష్ట్రాన్ని వణికించిన అర్నబ్ తుపాను వేళ కూడా చంద్రబాబు యావత్ అధికార యంత్రాంగాన్ని యుద్ధ ప్రాతిపదికన నడిపించి తుపాను తీరం తాకకముందే వేలాది మందికి సహాయక పునరావాస కేంద్రాలను సిద్ధం చేసి, లోతట్టు, తీరప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం ద్వారా అతి తక్కువ ప్రాణ, ఆస్తి నష్టాలతో విపత్తును ఎదుర్కొన్నారన్నారు. తుపాను విరుచుకుపడిన రాత్రంతా నిద్రలేకుండా కలెక్టర్లు అధికారులతో సమన్వయం చేసుకుంటూ తుఫాను వల్ల ఎక్కువగా ప్రాణ నష్టం లేకుండా ప్రజల్ని కాపాడగలిగారన్నారు. వైసీపీ హయాంలో విపత్తులు సంభవించినప్పుడు కనీసం పట్టించుకునే నాధుడే ఉండేవాడు కాదన్నారు. సెట్టింగులు వేసి బాధితులను పరామర్శించిన సందర్భాలు కూడా ఉన్నాయని ఆనాటి రోజులను గుర్తు చేశారు. సంక్షోభాలు ఎదురైనప్పుడే నాయకుడి ప్రతిభ బయట పడుతుందన్నారు. జగన్ పాలనలో అరాచకాలు, ఆర్థిక విధ్వంసాలతో రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి పోయిందన్నారు. అసలు జగన్ పాలనే రాష్ట్రానికి పెద్ద విపత్తుగా సంభవించిందన్నారు. ఆ విపత్తు నుంచి కోలుకోవడానికి రెండున్నర ఏళ్ల కాలం పట్టిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తుందన్నారు. సంక్షేమం, అభివృద్ధి జోడెద్దుగా పాలన సాగుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించడం ద్వారా రాష్ట్రంలో ట్రిపుల్ ఇంజన్ సర్కార్ నడవాలన్నారు. రావులపాలెం జడ్పీటీసీ అభ్యర్థి చిన్నం సత్య లక్ష్మితో పాటు 24 ఎంపీటీసీ స్థానాల్లో అత్యధిక మెజారిటీతో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఇవేం ఎన్నికలు.. ఎస్ఈసీ నిద్రపోతుందా?

పులివెందుల పెన్ సత్తా, నవంబర్ 01:: ఏపీలో ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసే పరిస్థితి లేదన్నారు వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి. పులివెందులలో టీడీపీ గూండాల దాడులు, పోలీసుల తీరుపై అవినాష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసులే ఓటర్లను అడ్డుకుంటున్నారు. వందల మంది బయట వ్యక్తులు పులివెందులకు వచ్చారు. కర్రలు, రాడ్లతో ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. పోలీసులు కూడా ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. మా అభ్యర్థులపై దాడులకు తెగబడుతున్నారు. దొంగ ఓట్లతో ఎన్నికల్లో నెగ్గాలని టీడీపీ చూస్తోంది. ఇంత జరుగుతున్నా ఎస్ఈసీ నిద్రపోతుందా? అని ప్రశ్నించారు.


ఇదిలా ఉండగా.. పులివెందులలో టీడీపీ గూండాలు విధ్వంసం సృష్టిస్తున్నారు. ఓటర్లను పచ్చమూకలు అడ్డుకుంటున్నాయి. పులివెందుల 11, 12 బూత్‌ల దగ్గర తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. వైఎస్సార్‌సీపీ ఏజెంట్లపై టీడీపీ గూండాలు రాళ్లు విసురుతున్నారు. బూత్‌లకు ఎవరూ రాకుండా పచ్చమూకలు అడ్డుకుంటున్నారు. పులివెందులలో 20 వార్డుల్లో టీడీపీ గూండాలు మకాం చేశారు. అన్ని పోలింగ్ బూతులను టీడీపీ నేతలు ఆక్రమించారు.

పులివెందులలో స్థైర విహారం చేస్తున్న టీడీపీ గూండాలు.. ఓటర్లు రాకుండా రాళ్ల దాడులు చేస్తున్నారు. ప్రజాస్వామ్యాన్ని పచ్చమూకలు ఖూనీ చేస్తున్నారు. టీడీపీ గూండాలకు పోలీసులు వత్తాసు పలుకుతున్నారు. ఓటు వేయకుండా పోలీసులు అడ్డుకోవడంతో పులివెందుల బాయ్స్ జూనియర్ కాలేజీ వద్ద ఓటర్లు నిరసనకు దిగారు. పోలింగ్ బూత్ వద్ద 400 మంది ఓటర్లు బైఠాయించారు. తమ ఓట్లు టీడీపీ నేతలే వేస్తున్నారని ఓటర్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. ఓటర్లపై డీఎస్పీ మురళీ నాయక్ బెదిరింపులకు దిగారు. వెళ్లిపోండి.. ఓట్లు వేయొద్దు అంటూ బెదిరించిన డీఎస్పీ.. మీకు ఓటు వేసే హక్కు లేదంటూ ఓటర్లకు డీఎస్పీ వార్నింగ్ ఇచ్చారు. ఓటర్లకు రక్షణ కల్పించకుండా పోలీసులు వెనక్కి పంపుతున్నారు. అనంతరం డీఎస్పీని మహిళలు నిలదీయడంతో మురళీ నాయక్ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ప్రశాంత వాతావరణంలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్.

క్షేత్రస్థాయిలో కలెక్టర్, ఎస్పీల విస్తృత తనిఖీలు.







యలమంచిలి, పెన్ సత్తా, నవంబర్ 01: అనకాపల్లి జిల్లా పరిధి లోని జీవీఎంసీ పలు వార్డులతో పాటు యలమంచిలి, నర్సీపట్నం మున్సిపాలిటీల ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ఆదివారం అత్యంత ప్రశాంత మైన వాతావరణంలో కొనసాగింది. ఎన్నికలు నిష్పాక్షికంగా, సజావుగా జరిగేలా జిల్లా యంత్రాంగం పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టింది.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా స్వయంగా క్షేత్రస్థాయి లోకి దిగి సమస్యాత్మక, సున్నిత మైన పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

యలమంచిలి రూరల్ పరిధి, యలమంచిలి మండలం పెదపల్లి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గల హైపర్ సెన్సిటివ్, సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలను, అలాగే ఎర్రవరం ఎంపీయూపీ పాఠశాల లోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. క్యూలైన్లలో ఉన్న ఓటర్ల గుర్తింపు కార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తును పర్యవేక్షించారు. యలమంచిలి టౌన్ పరిధిలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సంయుక్తంగా తులసీ నగర్ పరిధిలోని వార్డు నంబర్లు 8, 9, 10, 12 పోలింగ్ కేంద్రాలను (తులసీ నగర్ గర్ల్స్ హైస్కూల్ తదితర కేంద్రాలు) సందర్శించారు. అనంతరం గుర్రప్ప కళ్యాణ్ మండపం వద్ద కౌంటింగ్ కేంద్రాన్ని కూడా తనిఖీ చేశారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ ముగిసేవరకు పోలీస్ అధికారులు, సిబ్బంది అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని ఎస్పీ ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేందుకు ప్రజలు, అధికారులు అందిస్తున్న సహకారాన్ని వివరించారు. ఈ విస్తృత తనిఖీల్లో పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ బి.మోహనరావు, యలమంచిలి సీఐ ధనుంజయ రావు, కొత్తకోట సీఐ కోటేశ్వర రావు, రాంబిల్లి సీఐ నరసింగరావుతో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీవీఎంసీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఐజీ గోపీనాథ్ జట్టి.





పరవాడ, పెన్ సత్తా, నవంబర్ 01: అనకాపల్లి జిల్లా పరిధిలో ఆదివారం నిర్వహించిన జీవీఎంసీ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ అత్యంత ప్రశాంత మైన వాతావరణంలో ప్రారంభమై సజావుగా కొనసాగుతోంది. ఎన్నికల బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించేందుకు విశాఖపట్నం రేంజ్ ఐజీ గోపీనాథ్ జట్టి స్వయంగా క్షేత్రస్థాయిలోకి దిగి పలు పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరవాడ పరిధి లోని లంకెలపాలెం జడ్పీ హైస్కూల్ లోని సమస్యాత్మక (హైపర్‌సెన్సిటివ్) పోలింగ్ కేంద్రాన్ని ఐజీ సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన 5 పోలింగ్ స్టేషన్లను, ఓటర్ల క్యూలైన్లను పరిశీలించి బందోబస్తు తీరును సమీక్షించారు. పరవాడ పరిధి లోని 8 లొకేషన్లలో ఉన్న మొత్తం 18 పోలింగ్ స్టేషన్లలో పటిష్ట భద్రతా చర్యలు అమలులో ఉన్నాయని అధికారులు ఈ సందర్భంగా వివరించారు. అనంతరం పరవాడ పోలీస్ స్టేషన్‌ను కూడా సందర్శించి ఎన్నికల విధులను పరిశీలించారు. ఈ తనిఖీలలో భాగంగా విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందికి ఐజీ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద నిరంతరం అప్రమత్తంగా ఉంటూ శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా కట్టుదిట్ట మైన భద్రత కల్పించాలన్నారు. ఓటర్లు ప్రశాంతంగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా తగిన రక్షణ ఏర్పాట్లు చేయాలన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన సహాయక చర్యలు అందించాలి. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారి పై కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.


ఈ పర్యటనలో ఐజీ వెంట స్థానిక పరవాడ సీఐ ఎల్.భాస్కర రావు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన జీవీఎంసీ కమిషనర్.

- ఓటర్లు ఎక్కువసేపు క్యూ లైన్లలో వేచి ఉండకుండా వేగవంతంగా పోలింగ్ నిర్వహించాలి.
- బ్యాలెట్ పేపర్ల పంపిణీ ప్రక్రియను వేగవంతం.
- పోలింగ్ సజావుగా జరిగేలా చూడాలని సూచన.
- అనకాపల్లి పోలింగ్ కేంద్రం లోని హెల్ప్ డెస్క్ సందర్శన.
- ఓటు హక్కు వినియోగించుకున్న దివ్యాంగుడిని అభినందించిన కమిషనర్.
- 3 న జరగనున్న ఓట్ల లెక్కింపు కోసం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఏర్పాట్ల పరిశీలన.







విశాఖపట్నం, పెన్ సత్తా, నవంబర్ 01: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ రెండవ సాధారణ ఎన్నికల సందర్భంగా నగరం లోని అన్ని జోన్ల పరిధి లోని పలు పోలింగ్ కేంద్రాలను జీవీఎంసీ కమిషనర్, అదనపు ఎన్నికల అధికారి కేతన్ గార్గ్ ఆదివారం విస్తృతంగా పర్యటించి, పోలింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సిటీ ఆపరేషన్స్ సెంటర్ (సీవోసీ)ను సందర్శించడంతో పాటు, అన్ని జోన్ల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని సమీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎన్నికల అధికారులకు ఎప్పటికప్పుడు అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు క్యూ లైన్లలో ఎక్కువసేపు వేచి ఉండటాన్ని గమనించిన కమిషనర్, ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరితగతిన తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని పోలింగ్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా బ్యాలెట్ పేపర్ల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేసి, పోలింగ్ సజావుగా, ప్రశాంతంగా జరిగేలా చూడాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఓటర్లకు అవసర మైన సౌకర్యాలు కల్పించాలని, ఎన్నికల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులకు స్పష్టం చేశారు. అనంతరం అనకాపల్లి పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను సందర్శించి, ఓటర్లకు అందిస్తున్న సహాయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు వచ్చిన ఒక దివ్యాంగ ఓటరును కమిషనర్ అభినందించారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించు కోవడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. నగర వ్యాప్తంగా పోలింగ్ ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు ఎన్నికల అధికారులు, సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ కేతన్ గార్గ్ సూచించారు. అదే విధంగా, పోలింగ్ అనంతరం నవంబర్ 3 వ తేదీన ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి, అన్ని జోన్లకు సంబంధించిన కౌంటింగ్ కేంద్రాల్లో చేపడుతున్న ఏర్పాట్లను కమిషనర్ స్వయంగా పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రాల్లో అవసర మైన మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, ఇతర వసతులపై అధికారులకు పలు సూచనలు జారీ చేశారు.

వైసిపి అభ్యర్థులు ను అత్యధిక మెజారిటీ తో గెలిపించండి.





విస్తృతస్థాయి ఎన్నికల ఎన్నికల ప్రచారం లో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పయిల.

పరవాడ, పెన్ సత్తా, నవంబర్ 01:స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పరవాడ మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచార కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం కలపాక, నాయుడుపాలెం, వాడ చీపురుపల్లి పంచాయతీల పరిధిలో ఎంపిటిసి అభ్యర్థులు బోండా కనకారావు, బండారు శ్రావణ్ కుమార్, గొరుసు భూ లక్ష్మి, పరవాడ మండల వైఎస్సార్‌సీపీ జడ్పీటీసీ అభ్యర్థి బంధం దేవి లక్ష్మి పరిచయ కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పంచాయతీల్లో పార్టీ శ్రేణులు భారీ బైక్ ర్యాలీలు నిర్వహించి ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పయిల శ్రీనివాస రావు, రాష్ట్ర ఎస్‌ఈసీ సభ్యులు పి.ఎస్. రాజు, మండల పార్టీ అధ్యక్షులు కోన రామారావు హాజరై జడ్పీటీసీ అభ్యర్థి బంధం దేవి లక్ష్మితో కలిసి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ముందుగా గ్రామాల్లో అభ్యర్థిని ప్రజలకు పరిచయం చేస్తూ, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో మమేకమై ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో బైక్ ర్యాలీల్లో పాల్గొని గ్రామాల్లో ఉత్సాహంగా పర్యటించారు. వైఎస్సార్‌సీపీ జెండాలు, పార్టీ నినాదాలతో ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రచార సాగింది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం అనే లక్ష్యాలతో ప్రజల్లోకి వెళ్తోందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు గ్రామాల అభివృద్ధికి, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కీలకమని, ప్రజలతో నిరంతరం అందుబాటులో ఉండే నాయకత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. జడ్పీటీసీ అభ్యర్థి బంధం దేవి లక్ష్మికి మద్దతుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారని తెలిపారు. గ్రామాల్లో ప్రజలను నేరుగా కలుసుకుంటూ వారి సమస్యలు, స్థానిక అవసరాలను తెలుసుకుంటూ ప్రచార కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ప్రజలు తమ మద్దతు తెలియజేయాలని, పరవాడ మండల ఎంపీటీసీ అభ్యర్థులకు, జడ్పీటీసీ అభ్యర్థి బంధం దేవి లక్ష్మి కి రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తు పై ఓటు వేసి గెలిపించాలని నాయకులు ప్రజలను కోరారు. ఈ ఎన్నికల్లో పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేస్తూ ప్రతి గ్రామంలోనూ ప్రచారాన్ని విస్తృతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. బైక్ ర్యాలీల్లో యువత, పార్టీ అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని అభ్యర్థికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా పంచాయతీలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువత, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల నాటకాలు - తెర వెనక ఏకగ్రీవాల పర్వాలు.



- ఈసీ కోర్టు నుంచి తప్పించుకునేందుకు జీరో కాస్ట్ వ్యూహం.
- బిఎస్పీ టిడిపి వ్యూహం ఉందా.
- ఏకగ్రీవానికి వ్యతిరేకంగా ప్రజలు, ప్రజా సంఘాలు.



ధర్మవరం నవంబర్ 1 (పెన్ సత్తా) శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండల పరిధిలో ఇటీవల చోటుచేసుకున్న ఎంపీటీసీ ఎన్నికల పరిణామాలు, ఏకగ్రీవాల పర్వం, నామినేషన్ల నాటకాలు మరియు తెరవెనుక నడిచిన రాజకీయ కుట్రలపై వెలుగుచూసిన కథనాలు.

శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలంలోని ఎంపీటీసీ ఎన్నికల మండలంలోని మొత్తం 11 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా, అందులో 4 స్థానాలు ఏకగ్రీవమైనట్లు అధికారులు ప్రకటించడం వెనుక సాధారణ రాజకీయాలు లేవని, ముఖ్యంగా సంజీవపురం, తంబపురం ప్రాంతాల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ (వైస్సార్సీపీ) అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయకపోవడం, మాల్యవంతంలో వైసీపీ అభ్యర్థి నామినేషన్ సాంకేతిక కారణాల పేరుతో తిరస్కరణకు గురికావడం,డి. చెర్లోపల్లిలో బీజేపీ/కూటమి అభ్యర్థి ఏకగ్రీవం కావడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. వైఎస్ఆర్సీపీ మద్దతుతో బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్పి) అభ్యర్థులు స్పష్టమైన విజయావకాశాలు కలిగి ఉన్నప్పటికీ, అనూహ్యంగా వారు నామినేషన్లను ఉపసంహరించుకుని టీడీపీకి సునాయాసంగా సీట్లను కట్టబెట్టేలా చేసిన తీరుపై గ్రామాల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

ఉద్దేశపూర్వకంగానే 3 కీలక స్థానాల్లో బీఎస్పీ అభ్యర్థులతో నామినేషన్లు దాఖలు చేయించారు. దీనిద్వారా అధికారుల రికార్డుల్లో ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా, పోటీతో జరుగుతున్నాయని చూపించారు.ఆ తర్వాత నామినేషన్ల పరిశీలన ఘట్టం ముగిసి,పోటీ ప్రహసనం పూర్తయ్యాక,తమ వ్యూహంలో భాగంగా అభ్యర్థులను ఒత్తిడికి గురిచేసి నామినేషన్లను ఉపసంహరింపజేశారు.దీనివల్ల కోర్టుల నుంచి స్టే రాకుండా, ఈసీ విచారణ జరపకుండా కాగితాలపై స్వచ్ఛంద ఉపసంహరణలు అని చూపించి నేతలు లీగల్ సేఫ్టీ పొందారనే సంచలన ఆరోపణలు వస్తున్నాయి. అభ్యర్థులుకు రూ.10 లక్షల వరకు నగదు చేతులు మారిందనే ప్రచారం గ్రామాల్లో విపరీతంగా సాగింది. అయితే ఈ ప్రచారంపై బాధితులైన అభ్యర్థులు స్పందిస్తూ తమ చేతికి ఒక్క రూపాయి కూడా ముట్టలేదని,నగదు ఆరోపణలన్నీ పూర్తిగా అబద్ధమని తెగేసి చెప్పారు.తమ కుటుంబాల రక్షణ కోసమే,ఈ నిర్ణయం తీసుకోక తప్పలేదని, అంతే తప్ప స్వచ్ఛందంగానో లేక ప్రలోభాలకు లొంగో నామినేషన్లు వెనక్కి తీసుకోలేదని బాధితులు స్పష్టంగా తెలియజేస్తున్నారు. ఈ అంశంపై అధికారులువిచారణ చేపట్టకపోతే ప్రజా ఉద్యమం తప్పదు అని,బత్తలపల్లి మండలంలో జరిగిన ఎంపీటీసీ ఏకగ్రీవాల పర్వం నామినేషన్ల వేయడం నుంచి ఉపసంహరణల వరకు జరిగిన ప్రక్రియపై,సీసీటీవీ దృశ్యాలపై మరియు బాధితులపై వచ్చిన ఒత్తిళ్లపై రాష్ట్ర ఎన్నికల కమిషన్, జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపించాలి. లేనిపక్షంలో ఈ అక్రమ ఏకగ్రీవాలకు వ్యతిరేకంగా ప్రజలు, ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున నిరసనలను తెలియజేస్తున్నాయి.

ధర్మవరం మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతం.. 48 వార్డుల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ముగిసిన పోలింగ్.

- ఎస్పీ సతీష్ కుమార్ పర్యవేక్షణలో పటిష్ట పోలీసు బందోబస్తు.. పోలీసుల పనితీరుపై ప్రజలు,రాజకీయ నాయకుల ప్రశంసలు.
- బీఎస్ఆర్ పాఠశాల స్ట్రాంగ్ రూమ్‌కు బ్యాలెట్ బాక్సుల తరలింపు.. కట్టుదిట్టమైన పోలీసు భద్రత



ధర్మవరం,నవంబర్ 1 (పెన్ సత్తా)శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం మున్సిపాలిటీలోని 48 వార్డుల్లో ఆదివారం నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో ముగిసింది.ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ఎన్నికల నిర్వహణలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ప్రత్యేక పర్యవేక్షణ,అడిషనల్ ఎస్పీ కె.వి.మహేష్ సమన్వయం, ధర్మవరం డీఎస్పీ బి.వి.జగన్నాథరాజు ఆధ్వర్యంలో చేపట్టిన భద్రతా చర్యలపై పట్టణ ప్రజలు,వివిధ రాజకీయ పార్టీల నాయకుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తాయి.

జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఎన్నికల పోలింగ్ సమయంలో పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను స్వయంగా సందర్శిస్తూ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించారు.డీఎస్పీ జగన్నాథరాజు నేతృత్వంలో పోలీసు అధికారులు ఎన్నికల బందోబస్తును సమర్థవంతంగా నిర్వహించారు. వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప, టూటౌన్ సీఐ జయ నాయక్‌తో పాటు ముదిగుబ్బ సీఐ రామసుబ్బయ్య,సీఐ సునీత ప్రత్యేక పోలీసు బలగాలతో పట్టణంలోని వివిధ వార్డుల్లో నిరంతరం నిఘా ఏర్పాటు చేశారు.పోలింగ్ సమయంలో పోలీసులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తూ, ముందస్తు భద్రతా చర్యలు చేపట్టడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగింది. పోలీసు అధికారుల సమన్వయం, సిబ్బంది క్రమశిక్షణతో కూడిన విధులు శాంతిభద్రతల పరిరక్షణలో కీలకంగా నిలిచాయి.ముఖ్యంగా ధర్మవరం పట్టణంలోని 40వ వార్డులో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.ఈ సందర్భంగా 40వ వార్డు ప్రిసైడింగ్ అధికారి రామచంద్ర మీడియాతో మాట్లాడుతూ, వార్డులో ఎన్నికల పోలింగ్ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా పూర్తయిందని, ఎన్నికల నిర్వహణకు అధికారులు, రాజకీయ నాయకులు,సిబ్బంది అందరూ సహకరించారని తెలిపారు.

పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను పోలీసు భద్రత నడుమ ధర్మవరం బీఎస్ఆర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలించి, పటిష్టమైన భద్రత మధ్య భద్రపరచనున్నట్లు వెల్లడించారు.

మొత్తంగా జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ పర్యవేక్షణ,అడిషనల్ ఎస్పీ మహేష్ సమన్వయం,డీఎస్పీ జగన్నాథరాజు ఆధ్వర్యంలో పోలీసు అధికారులు,సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించడంతో ధర్మవరం మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.పోలీసు యంత్రాంగం చేపట్టిన భద్రతా చర్యలపై పట్టణ ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ధర్మవరం మున్సిపల్ ఎన్నికల్లో 77.09 శాతం పోలింగ్ నమోదు

అధికారుల సమన్వయంతోనే ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ..మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందనలు

ధర్మవరం,నవంబర్ 1 (పెన్ సత్తా) ధర్మవరం మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌ను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించి విజయవంతంగా ముగించిన ఎన్నికల అధికారులు,పోలీసు అధికారులు,జిల్లా యంత్రాంగానికి రాష్ట్ర వైద్య,ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, వైద్య విద్యాశాఖ మంత్రి,ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.ఆయనతో పాటు నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు కూడా జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు.

ధర్మవరం మున్సిపాలిటీతో పాటు శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, గొడవలు,ఘర్షణలకు తావులేకుండా పోలింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో సమన్వయంతో పనిచేసిన ఎన్నికల అధికారులు,జిల్లా పోలీసు అధికారులు, ధర్మవరం ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్‌తో పాటు ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బందికి మంత్రి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా అవసరమైన ఏర్పాట్లు చేయడంతో పాటు శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలింగ్ నిర్వహించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.ప్రజాస్వామ్య ప్రక్రియలో ఎన్నికలు అత్యంత కీలకమని, వాటిని పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం అధికారుల బాధ్యతాయుతమైన పనితీరుకు నిదర్శనమని తెలిపారు.

అధికారులు అందించిన నివేదిక ప్రకారం ధర్మవరం మున్సిపాలిటీలోని 48 వార్డుల పరిధిలో మొత్తం 1,06,250 మంది ఓటర్లు ఉండగా,వారిలో 81,908 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో మొత్తం 77.09 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారిక నివేదిక వెల్లడించింది.

ఎన్నికల నిర్వహణలో అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయడం వల్లే పోలింగ్ ప్రక్రియ ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా ముగిసిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.ఎన్నికల విధుల్లో పాల్గొన్న అధికారులు,పోలీసు సిబ్బంది,ఇతర శాఖల ఉద్యోగులతో పాటు ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఓటు హక్కును వినియోగించుకున్న ఓటర్లందరికీ



మంత్రి సత్యకుమార్ యాదవ్,హరీష్ బాబు మరోసారి కృతజ్ఞతలు తెలిపారు.


అంబేరుపురంలో ఎంపిటిసి అభ్యర్థి దాడి వెంకట అప్పారావు విస్తృత ప్రచారం



చోడవరం, నవంబర్1పెన్ సత్తా.... మండలంలోని అంబేరుపురం గ్రామంలో కూటమి పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు. జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గం ఇన్చార్జి పి.వీ.ఎస్.ఎన్ రాజు ఇంటింటికి తిరిగి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. చోడవరం జడ్పిటిసిగా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి కనిశెట్టి సన్యాసిరావు (మత్స్యరాజు) ను, ఎంపీటీసీ అభ్యర్థిగా జనసేన పార్టీకి చెందిన నాయకులు దాడి వెంకట అప్పారావు ను గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రచారానికి ప్రజల్లో విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అభ్యర్థి దాడి వెంకట అప్పారావు, జడ్పిటిసి అభ్యర్థి కనిశెట్టి మత్స్యరాజు, జనసేన పార్టీ నాయకులు అల్లం రామ అప్పారావు, పీలా మహేష్, టిడిపి నాయకులు వేగి శ్రీనివాసరావు, వేగి ముత్యాలునాయుడు భారీగా కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేన అభ్యర్థి సత్యవరపు శ్రీనివాసరావు జోరుగా ప్రచారం

చోడవరం, నవంబర్1 పెన్ సత్తా.... స్థానిక ఎంపీటీసీ సిగ్మెంట్ 2 జనసేన పార్టీ అభ్యర్థి సత్యవరపు శ్రీనివాసరావు జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఎంపీపీ అభ్యర్థి గూనూరు మల్లునాయుడు తో పాటు ఎంపీటీసీ జనసేన అభ్యర్థి సత్యవరపు శ్రీనివాసరావు చోడవరంలోని పెద్ద బజారు, చిన్న బజారు తదితర ప్రాంతాల్లో కలిసి తిరిగి ఓటర్లను తమకు ఒకసారి అవకాశం ఇవ్వాలని కోరారు. తమను గెలిపిస్తే సమస్యలు పరిష్కరిస్తామని ఓటర్లకు హామీ ఇచ్చారు. ఈ ప్రచారంలో భారీగా టిడిపి నాయకులు, కార్యకర్తలు, జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.



ధర్మవరం మున్సిపల్ ఎన్నికల్లో 77.09 శాతం పోలింగ్ నమోదు

134 పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంతంగా ముగిసిన ఓటింగ్..కమిషనర్ వెంకట రమణయ్య



ధర్మవరం,నవంబర్ 1 (పెన్ సత్తా)ధర్మవరం మున్సిపాలిటీ పరిధిలోని 48 వార్డులకు ఆదివారం నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య తెలిపారు.మొత్తం 1,06,250 మంది ఓటర్లు ఉండగా, వారిలో 81,908 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని,దీంతో తాత్కాలికంగా 77.09 శాతం పోలింగ్ నమోదైనట్లు వెల్లడించారు.

నవంబర్ 1వ తేదీ ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పట్టణంలోని 134 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియ కొనసాగిందని కమిషనర్ వివరించారు.ప్రతి రెండు గంటలకు ఒకసారి నమోదైన పోలింగ్ వివరాలను వెల్లడిస్తూ,మొదటి రౌండ్‌లో 7,154 మంది,రెండో రౌండ్‌లో 38,630 మంది, మూడో రౌండ్‌లో 57,613 మంది, నాలుగో రౌండ్‌లో 69,683 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు.చివరి ఐదో రౌండ్ నాటికి తాత్కాలికంగా 81,908 ఓట్లు నమోదైనట్లు పేర్కొన్నారు.

పోలింగ్ ముగిసిన అనంతరం 134 కేంద్రాలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులను పోలీసుల పటిష్ట భద్రత నడుమ ధర్మవరం బీఎస్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలించి భద్రపరిచినట్లు తెలిపారు. అధికారికంగా ఓట్ల సంఖ్య,పోలింగ్‌కు హాజరుకాని ఓటర్ల వివరాలు,తుది పోలింగ్ శాతాన్ని రాత్రి 9 గంటలకు వెల్లడించనున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు.

ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు సహకరించిన పోలీసు శాఖ,ఎన్నికల సిబ్బంది,విధుల్లో పాల్గొన్న ఉద్యోగులందరికీ ఆర్డీఓ రామభూపాల్ రెడ్డి,మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి కుటుంబ సభ్యులు



ధర్మవరం,నవంబర్ 1 (పెన్ సత్తా) పట్టణంలోని నెహ్రూ నగర్ పోలింగ్ బూత్ నెంబర్ 24/1 లో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, తమ్ముడు కృష్ణారెడ్డి, వారి కుటుంబ సభ్యులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ, ధర్మవరం ప్రజలు అభివృద్ధిని చూసి ఓటు వేశారన్న ఆత్మవిశ్వాసాన్ని వారు తెలిపారు. తప్పక వైఎస్ఆర్సిపి పార్టీ అధిక వార్డులలో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల వేళ జనసేన పార్టీకి ఎదురుదెబ్బ.

జనసేన నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరిక.



అచ్యుతాపురం, పెన్ సత్తా, నవంబర్ 01: స్థానిక సంస్థల ఎన్నికల వేళ అచ్యుతాపురం మండలంలో జనసేన పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్, జనసేన నాయకుడు చందక శివ, ఉప్పవరం గ్రామానికి చెందిన చందక తిరుమలరావు తమ వెంట సుమారు 20 మంది కార్యకర్తలతో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరారు. యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ చేరిక కార్యక్రమం జరిగింది.

మల్లవరం రవీంద్రరాజు, ఎంపీటీసీ అభ్యర్థి చందక శ్రీనివాస రావు, బుదిరెడ్డి భాస్కర్, భోజ నూకేష్, ధూళి తాతయ్య, రావి అప్పలరాజు, గొర్లె శ్రీను గార్ల సమక్షంలో చందక శివ, చందక తిరుమలరావులతో పాటు సుమారు 20 మంది కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా కరణం ధర్మశ్రీ, బొడ్డేడ ప్రసాద్ వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీ లోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జన్నవరం ఎంపీటీసీ అభ్యర్థి విస్తృతంగా ప్రచారం

చోడవరం రూరల్,నవంబర్1 పెన్ సత్తా.... మండలంలోని జన్నవరం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి నిట్టా రామలక్ష్మి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. నిట్టా రామలక్ష్మి తో పాటు ఎంపీటీసీ అభ్యర్థిని సెంట్రల్ బ్యాంక్ మాజీ డైరెక్టర్, బెన్నవోలు తాజా మాజీ సర్పంచ్ మూడెడ్ల శంకర్రావు ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తున్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు. ఈ ప్రచారంలో భారీగా వైసిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



చోడవరంలో పారిశుద్ధ్య పనులు





చోడవరం రూరల్,నవంబర్1 పెన్ సత్తా.... అర్నబ్ తుఫాన్ ప్రభావం, ఆ తర్వాత భారీ వర్షం వలన చోడవరంలోని చాలా ప్రాంతాలు ముంపుకు గురయ్యాయి. బాలాజీ నగర్, రెల్లివీధి, బానయ్య కోనేరు, పూర్ణ థియేటర్, ప్రేమ సమాజం, షుగర్ ఫ్యాక్టరీ ఎంప్లాయిస్ కాలనీ, చైత్ర నగర్ తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు వెళ్లే మార్గం లేక రోడ్లమీదే మోకాళ్ళు లోతు వరకు నీరు ప్రవహించింది. ఆ ప్రాంతంలో ప్రజలు ఇబ్బంది పడకుండా పంచాయతీ ఈవో జేఎవి గంగాధర్ దగ్గరుండి సిబ్బంది చేత పారిశుద్ధ్య పనులు చేయించారు. కాలువలు క్లీన్ చేయించి బ్లీచింగ్ జల్లించారు. ఆ ప్రాంతవాసులు ఇబ్బంది పడకుండా తగిన జాగ్రత్తలు సూచనలు తెలిపారు.

పులివెందులలో రీపోలింగ్ జరపాలి

పులివెందుల:నవంబర్1 పెన్ సత్తా.... స్థానిక ఎన్నికల్లో మున్సిపల్ పోల్ సందర్భంగా పట్టపగలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్సీపీ అధ్యక్షుడు శ్రీ వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఫైర్ అయ్యారు. పులివెందులలో బరి తెగించిన టీడీపీ తెల్లవారుజాము నుంచే పోలింగ్ బూత్‌లు స్వాధీనం చేసుకుందని, పట్టణంలో మొత్తం 80 బూత్‌లో ఉంటే, ఏకంగా 70 బూత్‌ల నుంచి వైయస్సార్సీపీ ఏజెంట్లను తరిమేశారని ఆయన వెల్లడించారు. వారందరినీ స్వయంగా మీడియాకు చూపిన ఆయన, ఆ తర్వాత ఆర్ఓ వద్దకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. పులివెందులలో ఇన్ని అరాచకాలు జరుగుతున్నాయి కాబట్టి, ఇక్కడ రీపోలింగ్ జరపాలని శ్రీ వైయస్ జగన్ డిమాండ్ చేశారు. ఇంత అప్రజాస్వామికంగా జరిగే ఎన్నికలు.. అసలు ఎన్నికలేనా? అని శ్రీ వైయస్ జగన్ గట్టిగా నిలదీశారు.

మీడియా ప్రశ్నలకు బదులిస్తూ మాట్లాడిన శ్రీ వైయస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..:

పులివెందులలో రీపోలింగ్ జరపాలి:

రాష్ట్రంలో పట్టపగలే ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోంది. అధికార పార్టీ యథేచ్ఛగా రిగ్గింగ్ చేస్తోంది. పులివెందులలో 80 పోలింగ్ బూత్‌లు ఉంటే, వాటిలో 70 బూత్‌లలో వైయస్సార్సీపీ ఏజెంట్లను తరిమేశారు. ఇప్పుడు వారందరినీ పులివెందుల ఆర్ఓ దగ్గరికి తీసుకెళ్తున్నా. అసలు మా పార్టీ ఏజెంట్లు లేకుండా ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని నిలదీయబోతున్నాను. వీటన్నింటి నేపథ్యంలో పులివెందులలో రీపోలింగ్ జరపాలని డిమాండ్ చేయబోతున్నాను.

తెలుగుదేశం గుండాల స్వైర విహారం:

పులివెందులలో తెలుగుదేశం పార్టీ, తెలుగుదేశం గుండాలు దగ్గరుండి ఏజెంట్లను పోలింగ్ బూత్‌ల నుంచి లాగి బయటకు పంపేశారు. ఎక్కడా మా పార్టీ ఏజెంట్లను బూత్‌లోకి పంపించే కార్యక్రమం జరగలేదు. పోలీసులు దగ్గరుండి, తెలుగుదేశం వారికి సహకరిస్తున్నారు.

అసలు ఇది ప్రజాస్వామ్యమేనా? మనం ప్రజాస్వామ్య వ్యవస్థలోనే ఉన్నామా? అన్న సందేహం కలుగుతోంది.

పులివెందులలో ఇదీ అరాచక పర్వం. అందరికీ తెలిసే ఇదంతా..:

పులివెందులలో ఇన్ని జరుగుతున్నా కనీసం అడిగే నాథుడు లేడు.

ఎస్పీకి ఫోన్ చేశాం. కలెక్టర్‌కు ఫోన్ చేశాం. కానీ ఏ మాత్రం ప్రయోజనం లేదు. పొద్దున నుంచి పులివెందులలో జరిగిన ఘటనల క్రమం చూస్తే.. తెల్లవారుజామున 4 గం. నుంచే తెలుగుదేశం పార్టీ వాళ్ళు బూత్‌లు ఆక్రమించారు. అలా పోలింగ్ కేంద్రాలు ఆక్రమించి, ఓటర్లను భయభ్రాంతులను గురి చేస్తున్నారు. మా పార్టీ చైర్‌పర్సన్ అభ్యర్థి ప్రమీలమ్మపై దాడి చేశారు. పోలింగ్ ఏజెంట్ సునంద చెయ్యి విరగ్గొట్టారు.

ఓటు వేయడానికి వచ్చిన ప్రజలను పోలింగ్ కేంద్రాల వద్దే అడ్డుకున్నారు. మహిళలను బెదిరించారు. ఓటర్ స్లిప్‌లను బలవంతంగా లాక్కొని వెనక్కి పంపించారు. అలా పోలింగ్ బూతులను ఆక్రమించి దొంగ ఓట్లు వేస్తున్నారు. అసలు ఓటర్ వచ్చే సరికే, దొంగ ఓట్లు వేస్తున్నారు.

మరోవైపు పోలీసులు టీడీపీ కార్యకర్తలకు సహకరిస్తూ, వైయస్సార్సీపీ పోలింగ్ ఏజెంట్లను అడ్డుకుంటున్నారు. పలు చోట్ల లాఠీఛార్జ్ చేశారు. మా పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిని బలవంతంగా పోలీసులు జీప్‌లోకి ఎక్కించుకొని పోయారు. మీడియాపైనా దాడి:

ఎన్నికల అక్రమాలు చిత్రీకరిస్తున్న ఇండియా టుడే ఛానల్, ఎన్టీవీ ఛానల్ రిపోర్టర్లు, కెమెరామెన్ల మీద దాడి చేశారు. వారి కెమెరాలు, సెల్ ఫోన్లు ధ్వంసం చేశారు.

తమను ఓటు వేయనీయడం లేదని చివరకు ఓటర్లు ధర్నాకు దిగుతున్నా పట్టించుకునే నాథుడు లేడు. కనీసం వారిని తీసుకెళ్లి ఓట్లు వేయించే కార్యక్రమం కూడా జరగడం లేదు. అంత దారుణమైన పరిస్థితి ఉంది.

ఇక్కడ నా ఇల్లు, ఓటు ఉంది కాబట్టి, ఈ బూత్‌లో మాత్రమే మా పార్టీ ఏజెంట్లను కూర్చోబెట్టారు. ఇంకా ఆశ్చర్యం ఎక్కడ కనిపిస్తుందంటే.. పులివెందులతో పాటు, కడప, జమ్మలమడుగు, చిత్తూరు, మాచర్ల, చిలకలూరిపేట, తాడిపత్రి, మదనపల్లి, చీమకుర్తి, కుప్పంలో కూడా ఇవే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

తప్పుడు సంప్రదాయం మొదలుపెట్టారు. మరి రేపు..?:

నిజంగా నేను చంద్రబాబునాయుడుని అడుగుతా ఉన్నాను. 'సిగ్గుండాలయ్యా నీకు చంద్రబాబునాయుడు'. ఇదే ఎస్సీని కూడా అడుగుతున్నాను. టీడీపీకి సహకరిస్తున్న కలెక్టర్లు, ఎస్పీలను అడుగుతున్నాను. ఇప్పుడు మీరు సెట్ చేస్తున్న ఒక తప్పుడు సంప్రదాయం, రేపు పొద్దున రాబోయే రోజుల్లో ఎలా ఉండబోతుంది?. భావితరానికి మీరు పంపిస్తున్న మెసేజ్ ఏమిటి?.

రేపు పొద్దున ఇంకా ఎన్నికలు అనేవి ఆంధ్ర రాష్ట్రంలో జరగవు. ఈ మాదిరిగా కక్షలు, కార్పణ్యాలతో, ఇలా ఎలక్షన్లు నిర్వహిస్తే రేపు పొద్దున ఇంకొక పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు, మీరు గతంలో ఇదే మాదిరిగా చేస్తే తప్పు లేనప్పుడు, మేము చేస్తే తప్పు ఏముంది అని.. కార్యకర్తలు కూడా తిరగబడతారు. అలా ఇప్పుడు మీరు ఒక తప్పుడు సంప్రదాయం మొదలు పెడుతున్నారు.

సీఎంగా చంద్రబాబు అనర్హుడు:

చంద్రబాబునాయుడు దాదాపు 80 ఏళ్ల వయసులోకి వచ్చిన తర్వాత కూడా ఇటువంటి దరిద్రమైన పనులు చేస్తూ, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న పరిస్థితులు చూస్తే, అసలు ఈ మనిషి ముఖ్యమంత్రిగా కొనసాగడానికి ఒక్క రోజు కూడా అర్హుడు కాదు. రొటేషన్ పద్ధతిలో ఓట్లన్నీ వీళ్ళంతకు వీళ్ళే గుద్దుకుంటా ఉన్నారు. కళ్ళ ముందే ఇలా ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతోంది. ఇక్కడ బందోబస్తు కోసం 1000 మంది పోలీసులను తీసుకొచ్చినట్లు చెప్పారు. అసలు ఆ పోలీసులను ఎందుకు తీసుకొచ్చారంటే ఈ అక్రమాలకు సపోర్ట్ చేయడం కోసం. కళ్లెదుటే అన్నీ. సుప్రీంకోర్టు ఆదేశాలూ భేఖాతరు:

మన కళ్ళెదుటే ఇన్ని వందల మంది ప్రతి బూత్ దగ్గర కనిపిస్తున్నారు. పక్కాగా తెలుగుదేశం పార్టీ గుండాలు కనిపిస్తున్నారు. అయినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోరు. 70 బూత్‌ల్లో నుంచి మా పార్టీ ఏజెంట్లను తరిమేశారు. ఇదే విషయం ఎస్పీకి ఫోన్ చేసి అడిగాను. ఆయనకన్నీ తెలుసు. అన్నీ చూస్తూ అలాగే ఊర్కుంటారు. కలెక్టర్‌కు కూడా అన్నీ తెలుసు. అయినా ఆయన అలాగే అన్నీ చూస్తూ కూర్చుంటారు. మరి అలాంటప్పుడు ఇది ఏ రకంగా నిజమైన ఎన్నిక?.

పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు అమర్చాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. మరి ఎన్ని చోట్ల ఆ ఏర్పాట్లు చేశారు? సీసీ టీవీ లైవ్ ఫుటేజ్ లేకుండా మీరు ఏ రకంగా ఎన్నికలు నిర్వహిస్తున్నారు?.

చివరకు ఏ స్థాయికి దిగజారారంటే..

నా ఛాపర్ ప్రయాణంపైనా కుట్ర చేశారు:

బెంగళూరు నుంచి ఛాపర్‌లో నేను బయలుదేరాను. ఇక్కడికి రావడానికి నిన్న అనుమతి కూడా ఇచ్చారు. కానీ, నా ఛాపర్ ప్రయాణం మధ్యలో ఉండగా, పులివెందులలో ఛాపర్ ల్యాండింగ్‌కు అనుమతి నిరాకరించారు. పులివెందులలో జగన్ ఛాపర్ ల్యాండ్ కావొద్దు. 3 గం. తర్వాతే నేను ఇక్కడికి రావాలని అన్నారు. అలా అంటూ, నిన్న ఇచ్చిన పర్మిషన్ రద్దు చేసినట్లు ప్రకటించారు.

దీంతో విషయాన్ని నేరుగా పౌర విమానయాన శాఖకు చెప్పడం జరిగింది. దాంతో వారు అధికారుల నిర్ణయాన్ని తీవ్రంగా తప్పు బట్టారు. ఛాపర్ ల్యాండింగ్‌కు నిన్న పర్మిషన్ ఇచ్చి, హఠాత్తుగా ఈరోజు దాన్ని రద్దు చేయడాన్ని ఆ శాఖ అధికారులు తప్పు బట్టారు. అంతే కాకుండా ఛాపర్ మార్గమధ్యలో ఉన్నప్పుడు ఇలా ల్యాండింగ్ పర్మిషన్ రద్దు చేయడం సరికాదని వారు తేల్చి చెప్పడంతో, ఎట్టకేలకు ఇక్కడ ఛాపర్ ల్యాండింగ్‌కు ఒప్పుకున్నారు. అంటే ఏ స్థాయిలో కుట్ర జరుగుతోంది అన్న విషయం అర్థం చేసుకోవచ్చు.

అందుకే అలాంటివి పుట్టుకొస్తున్నాయి:

పెద్దలంతా కలిసి ఇలా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుంటే ఎలా?. నక్సలిజం అనేది ఎక్కడి నుంచి పుడుతుంది?. ప్రజలను కాపాడాల్సిన వాళ్లే, ప్రజలను భక్షించే కార్యక్రమాలు చేసినప్పుడు, ప్రజలను కాపాడాల్సిన వారే, ప్రజలకు అన్యాయం చేసినప్పుడు నక్సలిజం పుడుతుంది, కాక్రోచ్‌లు పుడతాయి.

రాష్ట్రంలో దయనీయ పరిస్థితి:

ఈరోజు రాష్ట్రంలో పరిస్థితి దయనీయంగా మారింది. దానికి కారణం పాలకులుగా ఉన్న వారు. వారు తమ మనస్సాక్షిని అడగాలి. మీరు చేస్తున్న పాలన బాగుందా అని? ఒకవేళ మీరు చేస్తున్న పాలన బాగుంటే, మరీ ఈ స్థాయికి దిగజారాల్సిన అవసరం ఉందా?

సూపర్ సిక్స్‌లు లేవు. సూపర్ సెవెన్లు లేవు. ప్రజలకి ఇచ్చిన బాండ్లు అన్నీ ఒట్టివే అయ్యాయి. దీంతో ఎక్కడికక్కడ ప్రజలు నిలదీస్తున్నారు. మరోవైపు వ్యవస్థలన్నీ కుప్పకూలాయి. పిల్లలకు ఫీజ్ రీయంబర్స్‌మెంట్ లేక.. విద్యాదీవెన, వసతిదీవెన రాక పిల్లలు తిరగబడుతున్నారు. ఉద్యోగస్తులకు మేనిఫెస్టోలో చెప్పినవి ఏవీ అమలు కాక, వారూ తిరగబడుతున్నారు. మహిళలకు చివరికి సున్నా వడ్డీ కూడా రద్దు చేశారు. దాంతో వారూ తిరగబడుతున్నారు. రైతులకు ఏ ఒక్కరికి గిట్టుబాటు ధర రావడం లేదు, రైతులకు ఇచ్చిన హామీలన్నీ మోసాలుగా తేలడంతో, వారూ తిరగబడుతున్నారు.

ఎంపీపీ అభ్యర్థి గూనూరు మల్లునాయుడు

ప్రచారానికి విశేష స్పందన





చోడవరం, నవంబర్1 పెన్ సత్తా.... స్థానిక ఎన్నికల్లో చోడవరం మండల ఎంపీపీ అభ్యర్థిగా గూనూరు మల్లునాయుడు ప్రచారం చేస్తుండగా ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుంది. పెద్ద బజార్ వీధి, వెలమ వీధి, చిన్న బజారు, రెల్లి వీధి, లక్ష్మీదేవి పేట తదితర ప్రాంతాల్లో మల్లునాయుడు కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులుతో విస్తృతంగా ప్రచారం చేశారు. టిడిపి అభ్యర్థులు పోటీలో ఉన్న ప్రాంతంలో ఫ్యాను గుర్తుకు, జనసేన అభ్యర్థులు పోటీలో ఉన్న ప్రాంతంలో గాజు గ్లాస్ కు ప్రజలు ఓటు వేయాలని కోరారు. తనకు ఒక అవకాశం ఇస్తే చోడవరం మండలాన్ని అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. ఈ ప్రచారంలో భారీగా టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

మత్స్యరాజును సత్కరించిన జనసేన నాయకులు



చోడవరం, నవంబర్1 పెన్ సత్తా... చోడవరం మండల కూటమి జడ్పిటిసి అభ్యర్థి కనిశెట్టి మత్స్యరాజు ను జనసేన పార్టీ నాయకులు సత్కరించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జనసేన నాయకులను కలవగా పార్టీ విశాఖ ఉమ్మడి జిల్లా కార్యదర్శి సిరిపురపు రమేష్, మండల అధ్యక్షులు గూనూరు మూలునాయుడు, సింగంపల్లి రమేష్, కలగర్ల మనోజ్ సత్కరించారు.

అన్నవరంలో వైసిపి నాయకులు విస్తృతంగా ప్రచారం






చోడవరం, నవంబర్1 పెన్ సత్తా.... స్థానిక ఎన్నికల్లో భాగంగా చోడవరం పట్టణంలోని అన్నవరంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పందిరి శ్రీనివాసరావు, పుల్లేటి వెంకటేష్ తదితరులు వైసిపి ఎంపీటీసీ అభ్యర్థి గుంతల చినరాజు ను గెలిపించాలని ఓటర్లను కోరుతున్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి జడ్పిటిసి అభ్యర్థిగా డివిఆర్ ను, ఎంపీటీసీ అభ్యర్థిగా గుంతల చినరాజును గెలిపించాలని కోరారు. ప్రజల నుండి విశేష స్పందన లభించింది. పోటీ చేస్తున్న ఎంపీటీసీ అభ్యర్థితో పాటు వైసిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్నారు.

ఫ్లైట్ ప్రయాణికులకు గుడ్ న్యూస్..
అదనపు బాదుడుకు అడ్డుకట్ట

భారతీయ విమానయాన రంగంలో ప్రయాణీకుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విమాన టికెట్ల ధరల పెంపులో ఏకపక్ష ధోరణులకు అడ్డుకట్ట వేసేందుకు, ప్రయాణీకులపై అదనపు చార్జీల భారాన్ని తగ్గించేందుకు ఉద్దేశించిన కొత్త విమాన చార్జీల (ఎయిర్‌ఫేర్) నిబంధనలను కేంద్ర ప్రభుత్వం ఖరారు చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఈ నిబంధనలకు తుదిరూపు తెచ్చింది. ప్రైవేట్ విమాన సంస్థలు పండుగలు, సెలవుదినాలు, అత్యవసర సమయాల్లో ఇష్టానుసారం టికెట్ ధరలను విపరీతంగా పెంచుతున్నాయనే విమర్శలపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్న విషయం తెలిసిందే. సామాజిక కార్యకర్త ఎస్.లక్ష్మీనారాయణ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం నేపథ్యంలో కోర్టు జోక్యంతో కేంద్రం ఈ సూతన విధానాన్ని తీసుకువచ్చింది. డైనమిక్ ప్రైసింగ్ పేరిట ప్రయాణీకులను దోచుకుంటున్న తీరుపై తగిన నియంత్రణ ఉండాలని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేయడంతో ప్రభుత్వం ఈ చట్టబద్ధమైన నిబంధనలను సిద్ధం చేసింది. కేవలం బేస్ ఫేర్ మాత్రమే కాకుండా లగేజ్ ఫీజులు, సీట్ సెలక్షన్, ఇతర అదనపు ప్రయాణీకుల చార్జీల మోతకు ఈ నిబంధనల ద్వారా అడ్డుకట్ట పడనుంది. విమానయాన సంస్థలు టికెట్ల ధరల నియంత్రణలో మరింత పారదర్శకత పాటించేలా నిబంధనలను రూపొందించారు. విమానాల



రాకపోలకు అంతరాయం ఏర్పడినప్పుడు లేదా విపరీతమైన ధరల పెరుగుదల సమయంలో ప్రభుత్వ యంత్రాంగం జోక్యం చేసుకునేలా నిబంధనల్లో వెసులుబాటు కల్పించారు. ఈ సూతన నిబంధనలకు సంబంధించి ఇప్పటికే పరిపాలనాపరమైన ఆమోదం లభించిందని, త్వరలోనే అధికారిక గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానుందని కేంద్ర ప్రభుత్వం కోర్టుకు వెల్లడించింది.

బిజినెస్

పండగ వేళ ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.2,820!



దేశంలో రాబోయే పండగల సీజన్ వేళ సామాన్యులు, హోటళ్లపై ఆర్థిక భారం మోపుతూ చమురు మార్కెటింగ్ కంపెనీలు మరోసారి ధరల పెంపునకు సిద్ధపడ్డాయి. వాణిజ్య అవసరాలకు వినియోగించే 19 కేజీల ఎల్‌పీజీ సిలిండర్ ధరను మరో రూ.10 పెంచుతూ నవంబర్ 1 నుంచి కొత్త ధరలను అమల్లోకి తెచ్చాయి. దీంతో దేశ రాజధాని ఢిల్లీలో ఒక కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.2,820కి చేరుకుంది. వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు వరుసగా మూడో నెల కూడా పెరగడం గమనార్హం. గత సెప్టెంబర్, అక్టోబర్ నెలలతో పాటు తాజాగా నవంబర్‌లోనూ ధరలు పైకి కదలడం వ్యాపార వర్గాలను కలవరపెడుతోంది. అంతర్జాతీయ విపణిలో ముడి చమురు ధరల్లో నెలకొన్న అనిశ్చితి, సౌదీ అరామ్‌కో కాంట్రాక్ట్ ధరల పెరుగుదల, సముద్ర మార్గాల్లో రవాణా రిస్క్ ప్రీమియంలు పెరగడం వంటివే ఈ ధరల సవరణకు ప్రధాన కారణమని ఇంధన రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

హోటళ్లు, రెస్టారెంట్లపై ప్రభావం

దీపావళి పండుగ వేళ ఈ ధరల పెంపు హోటళ్లు, రెస్టారెంట్లు, కేటరింగ్, ఇతర చిన్నపాటి వ్యాపారాలపై ప్రభావం చూపనుంది. ఇప్పటికే ఆహార పదార్థాల ముడిసరుకుల ధరలు పెరిగి సతమతమవుతున్న హోటెల్ విభాగానికి ఈ వాణిజ్య గ్యాస్ ధరల భారం మరింత భారంగా మారనుంది. దీనివల్ల రాబోయే రోజుల్లో హోటళ్లలో తినే తిండి, టీ-కాఫీలు తదితర సేవలు మరింత ప్రియమయ్యే ప్రమాదం ఉంది.

గృహ వినియోగదారులకు ఊరట

మరోవైపు, గృహ వినియోగదారులకు ఉపశమనం కలిగించేలా 14.2 కేజీల సాధారణ దేశీయ (డొమెస్టిక్) ఎల్‌పీజీ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పు చేయలేదని చమురు కంపెనీలు స్పష్టం చేశాయి. దేశ రాజధాని ఢిల్లీలో డొమెస్టిక్ సిలిండర్ ధర రూ.942 వద్దే స్థిరంగా కొనసాగుతోంది. కోట్లాది కుటుంబాలకు ఇది తాత్కాలిక ఊరటనిచ్చినప్పటికీ కమర్షియల్ గ్యాస్ ధరల పెరుగుదల పరోక్షంగా ద్రవ్యోల్బణాన్ని మరింత పెంచే అవకాశం ఉందని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు.

ఏఐ షాపింగ్‌లో జెన్‌జీ కంటే మినియల్స్ టాప్!

సాంకేతికత వేగంగా మారుతున్న తరుణంలో భారతీయ వినియోగదారుల కొనుగోలు శైలిలోనూ విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. ఏఐ ఆధారిత షాపింగ్ టూల్స్‌ను ఉపయోగించడంలో మినియల్స్ సరికొత్త ట్రెండ్ సృష్టిస్తున్నారు. ప్రముఖ గ్లోబల్ మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్ సంస్థ మెకిన్సే అండ్ కంపెనీ తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం, భారతదేశంలో మినియల్స్(1981 నుంచి 1996 మధ్య జన్మించిన వారు)లో ఏఐ షాపింగ్ అడాప్షన్ ఏకంగా 84 శాతంగా నమోదైంది. దీనితో వారు జెన్‌జీ (1997 నుంచి 2012 మధ్య జన్మించిన వారు-74 శాతం)తో పోలిస్తే ముందుజలో ఉన్నారు.

ప్రపంచ స్థాయిలో భారత్‌కు రెండో స్థానం

ఏఐ ఆధారిత కొనుగోళ్లలో చైనా తొలి స్థానంలో ఉండగా భారతదేశం ప్రపంచంలోనే రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది. ప్రపంచ సగటు (53 శాతం)తో పోలిస్తే భారతదేశంలో ఏఐ షాపింగ్ వినియోగం 76 శాతంగా ఉండటం విశేషం. దేశంలోని వినియోగదారులు కేవలం ప్రొడక్ట్ సెర్చ్ చేయడం వరకే పరిమితం కాకుండా వస్తువులను పోల్చడానికి, సరైన నిర్ణయాలు తీసుకోవడానికి, చివరికి చెల్లింపులు పూర్తి చేయడానికి కూడా ఏఐ టూల్స్‌పై ఆధారపడుతున్నారు.

క్యాన్సర్ మందుల ధరలకు భారీ కోత!

న్యూఢిల్లీ: క్యాన్సర్ వ్యాధితో పోరాడుతున్న రోగులకు కేంద్ర ప్రభుత్వం ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. క్యాన్సర్ చికిత్సలో ఉపయోగించే 543 బ్రాండ్ల ఔషధాల గరిష్ఠ విక్రయ ధరలను భారీగా తగ్గించింది. కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ పరిధిలోని జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ (ఎన్‌పీపీఏ) ఈ మేరకు అధికారిక ప్రకటన విడుదల చేసింది. తగ్గించిన కొత్త ధరలు నవంబర్ 9 నుంచి అమల్లోకి రానున్నాయి. కొన్ని కీలక ఔషధాల ధరలు 80 శాతానికి పైగా తగ్గడం విశేషం. దీంతో ఖరీదైన క్యాన్సర్ చికిత్స పొందుతున్న రోగులకు ఆర్థిక భారం కొంతమేర తగ్గనుంది.

మూడు కీలక మందుల ధరల్లో భారీ తగ్గింపు..

ట్రేడ్ మార్జిన్ రేషనలైజేషన్ విధానం ద్వారా ఔషధాల విక్రయంపై ఉన్న అధిక లాభాల మార్జిన్లను నియంత్రిస్తూ ఎన్‌పీపీఏ ఈ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా బెవాసిజాబ్ ఇంజెక్షన్ ధర రూ.21,767 నుంచి రూ.5,930కి తగ్గింది. ఫుల్వెస్ట్రాంట్ ఇంజెక్షన్ ధర రూ.26,072 నుంచి రూ.5,491కి దిగివచ్చింది. అజాసిటిడిన్ ఇంజెక్షన్ ధర రూ.6,337 నుంచి రూ.1,495కి తగ్గింది. ఈ ధరల తగ్గింపు క్యాన్సర్ చికిత్సకు అయ్యే ఖర్చును తగ్గించడంలో కీలకంగా



మారనుంది.

20కి పైగా క్యాన్సర్ల చికిత్సకు ఉపయోగం..

రొమ్ము క్యాన్సర్, ప్రోస్టేట్ క్యాన్సర్, పెద్దప్రేగు క్యాన్సర్, అండాశయ, గర్భాశయ క్యాన్సర్లతో పాటు 20కి పైగా రకాల క్యాన్సర్ల చికిత్సలో ఉపయోగించే ఔషధాలు ఈ జాబితాలో ఉన్నాయి. ఇమ్యునోథెరపీ మందులు, డెనోసుమాబ్, పెగ్‌ఫిల్‌గ్రాస్టిమ్ వంటి కీలక ఔషధాల ధరలు కూడా తగ్గనున్నాయి. క్యాన్సర్ చికిత్సలో దీర్ఘకాలం పాటు మందులు వాడాల్సి రావడంతో ధరల తగ్గింపు రోగుల కుటుంబాలకు కొంత ఆర్థిక ఉపశమనం కలిగించనుంది.

మరిన్ని మందుల ధరల తగ్గింపునకు అవకాశం..

ఫార్మా కంపెనీల నుంచి అదనపు వివరాలు అందిన కొద్దీ ఔషధాల ధరల జాబితాను మరింత విస్తరించే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. క్యాన్సర్ చికిత్సను సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావడం, మందుల ధరలపై నియంత్రణ కొనసాగించడం ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కొత్త ధరలు అమల్లోకి వచ్చిన తర్వాత రోగులకు వాస్తవంగా ఎంత మేరకు ప్రయోజనం చేకూరుతుందన్నది కీలకం కానుంది

ఇషాన్, శ్రేయస్ అర్ధశతకాలు వృథా..
చివరి టీ20లో భారత్‌కు ఓటమి



న్యూజిలాండ్‌తో సిరీస్‌ను ఇప్పటికే కైవసం చేసుకున్న టీమిండియాకు ఆఖరి టీ20లో ఓటమి తప్పలేదు. ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్ అర్ధ శతకాలతో 191 పరుగులు చేసినా.. టిమ్ సీఫర్ట్ (93), గ్లెన్ ఫిలిప్స్ (65 నాటౌట్) ధాటికి న్యూజిలాండ్ లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది. మరో 12 బంతులు మిగిలుండగానే ఏడు వికెట్ల తేడాతో గెలిచి సిరీస్‌ను 3-2తో ముగించింది.

ఇషాన్, శ్రేయస్ అర్ధ శతకాలతో రాణింపు

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. అభిషేక్ శర్మ 1, సంజూ శాంసన్ 4 పరుగులకే ఔటయ్యారు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్ కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఇద్దరూ దూకుడుగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ఇషాన్ కిషన్ 32 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లతో 61 పరుగులు చేశాడు. శ్రేయస్ అయ్యర్ 23 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 50 పరుగులు సాధించాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు కీలక భాగస్వామ్యాన్ని అందించారు. ముఖ్యంగా మైఖేల్ బ్రేస్‌వెల్ వేసిన పదో ఓవర్లో ఏకంగా 27 పరుగులు రాబట్టారు. దీంతో పది ఓవర్లకు భారత్ 111/2తో పటిష్ఠ స్థితిలో నిలిచింది. అయితే అర్ధ శతకాల తర్వాత ఇద్దరూ స్వల్ప వ్యవధిలోనే ఔటయ్యారు. ఇషాన్ కిషన్‌ను బ్లెయిర్ టిక్నర్, శ్రేయస్ అయ్యర్‌ను నాథన్ స్మిత్ పెవిలియన్‌కు పంపించారు. తిలక్ వర్మ 6 పరుగులకే వెనుదిరిగాడు. వరుస వికెట్లు కోల్పోయిన భారత్‌ను నామన్ ధీర్, నితీశ్ కుమార్ రెడ్డి ఆదుకున్నారు. నామన్ ధీర్ 23 బంతుల్లో 4 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 33 పరుగులు చేశాడు. నితీశ్ కుమార్ రెడ్డి 17 బంతుల్లో 2 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 22 పరుగులు సాధించాడు. చివర్లో భువనేశ్వర్ కుమార్ 6, అర్ష్‌దీప్ సింగ్ 1 పరుగు చేశారు. ప్రిన్స్ యాదవ్ ఖాతా తెరవలేదు. దీంతో నిర్ణీత 20 ఓవర్లు ముగిసేసరికి భారత్ 191 పరుగులకు చేరుకుంది.

న్యూజిలాండ్ బౌలర్లలో ఆడమ్ మిల్నే 19 పరుగులిచ్చి నాలుగు వికెట్లు పడగొట్టాడు. బ్లెయిర్ టిక్నర్ 38 పరుగులిచ్చి రెండు వికెట్లు, నాథన్ స్మిత్ 28 పరుగులిచ్చి రెండు వికెట్లు తీశారు.

సీఫర్ట్ విధ్వంసం.. ఫిలిప్స్ అండ

192 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఫిన్ అలెన్ 2 పరుగులకే అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ తర్వాత టిమ్ సీఫర్ట్, డారిల్ మిచెల్ భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. ముఖ్యంగా సీఫర్ట్ దూకుడుగా ఆడుతూ పరుగుల వరద పారించాడు. 13 పరుగుల వద్ద నామన్ ధీర్ చేతికి చిక్కాల్సిన సీఫర్ట్ క్యాచ్‌ను జారవిడిచాడు. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకున్న అతడు భారత బౌలర్లను ఉతికారేశాడు. కేవలం 50 బంతుల్లో 11 ఫోర్లు, 5 సిక్సర్లతో 93 పరుగులు చేశాడు. సెంచరీకి చేరువైన సమయంలో నితీశ్ కుమార్ రెడ్డి బౌలింగ్‌లో బౌల్డ్ అయ్యాడు.

మరోవైపు డారిల్ మిచెల్ కూడా వేగంగా ఆడాడు. 16 బంతుల్లో 29 పరుగులు చేసి వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌లో అభిషేక్ శర్మకు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. అప్పటికి న్యూజిలాండ్ స్కోరు 84/2గా ఉంది. మిచెల్ ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన గ్లెన్ ఫిలిప్స్.. సీఫర్ట్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. వీరిద్దరూ భారత బౌలర్లపై విరుచుకుపడ్డారు. ఫిలిప్స్ 38 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 65 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. 15.3వ ఓవర్లో సీఫర్ట్ ఔటైనప్పటికీ.. ఫిలిప్స్ జోరు తగ్గలేదు. చివరి ఓవర్లలో అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్‌లో సిక్స్, ఫోర్లు బాదాడు. అనంతరం భువనేశ్వర్ కుమార్ వేసిన 18వ ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు కొట్టి మ్యాచ్‌ను ముగించాడు. మరోవైపు బీవన్ జాకబ్స్ ఒక పరుగుతో నాటౌట్‌గా నిలిచాడు. దీంతో న్యూజిలాండ్ 17.6 ఓవర్లలో 195/3 స్కోరు చేసి ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది.

ఫిలిప్స్ ఖాతాలో సిరీస్ రికార్డు

ఈ మ్యాచ్‌లో అర్ధ శతకంతో రాణించిన గ్లెన్ ఫిలిప్స్ మరో ఘనత సాధించాడు. ద్వైపాక్షిక టీ20 సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. ఈ సిరీస్‌లో మొత్తం 332 పరుగులు సాధించాడు. అంతేకాకుండా నాలుగు అర్ధ శతకాలు సమోదు చేశాడు.

స్పోర్ట్స్

ఇషాన్ కిషన్ అరుదైన ఘనత..
సూర్యకుమార్ రికార్డు తెరమరుగు!



టీమిండియా యువ వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ అరుదైన ఘనత సాధించాడు. అంతర్జాతీయ టీ20ల్లో ఒక క్యాలెండర్ ఏడాదిలో అత్యధిక పరుగులు చేసిన భారత ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. న్యూజిలాండ్‌తో ఆదివారం జరిగిన ఐదో టీ20లో ఈ ఘనత అందుకున్నాడు. ఈ మ్యాచ్‌లో 32 బంతుల్లో 61 పరుగులు చేసి జట్టు స్కోరు పెరగడంలో కీలక పాత్ర పోషించాడు.


సూర్యకుమార్ రికార్డు బద్దలు

2022లో టీమిండియా మాజీ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ 31 ఇన్నింగ్స్‌ల్లో 1,164 పరుగులు చేశాడు. ఇప్పటివరకు ఇదే భారత రికార్డుగా ఉంది. ఇషాన్ ఈ ఏడాది 37 ఇన్నింగ్స్‌ల్లో 1,220 పరుగులు చేసి ఆ రికార్డును అధిగమించాడు. ఐదో టీ20కి ముందు అతడి ఖాతాలో 1,159 పరుగులు ఉన్నాయి. సూర్య రికార్డును అధిగమించడానికి మరో ఆరు పరుగులు అవసరం కాగా.. ఇన్నింగ్స్ ఆరంభంలోనే ఆ మైలురాయిని చేరుకున్నాడు.

ప్రపంచ జాబితాలో నాలుగో స్థానం

ఒక క్యాలెండర్ ఏడాదిలో టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో ఇషాన్ ప్రస్తుతం నాలుగో స్థానంలో నిలిచాడు. ఆస్ట్రియా ఆటగాడు కరణ్‌బీర్ సింగ్ 1,488 పరుగులతో అగ్రస్థానంలో ఉన్నాడు. పాకిస్తాన్ ఆటగాడు మహ్మద్ రిజ్వాన్ 1,326 పరుగులతో రెండో స్థానంలో, బ్రెహెయిన్ ఆటగాడు ఫయాజ్ అహ్మద్ 1,251 పరుగులతో మూడో స్థానంలో ఉన్నారు. టెస్టు హోదా కలిగిన దేశాల ఆటగాళ్లలో ఇషాన్ రెండో స్థానంలో నిలిచాడు. ఇదే మ్యాచ్‌లో ఇషాన్ అంతర్జాతీయ టీ20ల్లో 2 వేల పరుగుల మైలురాయిని కూడా అందుకున్నాడు. బంతుల పరంగా ఈ ఘనత సాధించిన మూడో వేగవంతమైన భారత ఆటగాడిగా నిలిచాడు. ఇషాన్ 1,345 బంతుల్లో ఈ పరుగులు పూర్తి చేశాడు. అభిషేక్ శర్మ 1,024 బంతుల్లో, సూర్యకుమార్ యాదవ్ 1,164 బంతుల్లో ఈ మైలురాయిని చేరుకున్నారు. ఈ సిరీస్‌లో ఇషాన్‌కు ఆరంభం ఆశించిన స్థాయిలో లేదు. ఆడిన తొలి మ్యాచ్‌లో ఒక పరుగు, నాలుగో టీ20లో సున్నాకే వెనుదిరిగాడు. కుడి తొడ కండరాల గాయంతో మధ్యలో రెండు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. అయితే చివరి మ్యాచ్‌లో అర్ధశతకంతో మెరిసి రెండు కీలక రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు.

కోటి నుంచి 45కోట్లకు... పారితోషికంలో NBK ప్రయాణం!



నటసింహా నందమూరి బాలకృష్ణ పారితోషికం గ్రాఫ్ ఇప్పుడు ప్రధానంగా చర్చల్లోకొచ్చింది. ఆయన తొందర్లోనే 50కోట్ల పారితోషికం క్లబ్ లో చేరబోతున్నారనేది అభిమానుల్లో ఉత్సుకతను పెంచుతోంది. బాలకృష్ణ బాక్సాఫీస్ ప్రయాణంతో పాటు అతడి పారితోషికం గ్రాఫ్ కూడా ఊహించని స్థాయిలో పుంజుకుంటూ టాలీవుడ్ వర్గాల్లో సరికొత్త రికార్డులను సృష్టించడంపై ఆసక్తికర చర్చ సాగుతోంది. కెరీర్ ప్రయాణం తొలినాళ్ల నుంచి మాస్ హృదయాలను ఏలుతున్న నటసింహం, 90ల చివర్లో -సమరసింహారెడ్డి-,-నరసింహనాయుడు- చిత్రాలతో టాలీవుడ్‌లో రికార్డు స్థాయి కలెక్షన్లు రాబట్టారు. ఆ రోజుల్లో ఈ ఇండస్ట్రీ హిట్ చిత్రాలకు బాలకృష్ణ కేవలం 1 కోటి నుంచి 2 కోట్ల రేంజులోనే పారితోషికం అందుకోవడం విశేషం. సమర సింహారెడ్డి చిత్రాన్ని 6 కోట్ల బడ్జెట్ తో నిర్మించగా 30 కోట్లు వసూలు చేయడం ఒక సంచలనం. అయితే నాటి బాక్సాఫీస్ ప్రమాణాలు సినిమా బడ్జెట్ దృష్ట్యా 2 కోట్ల రేంజు పారితోషికం అత్యధికమే. ఇప్పటి లెక్కలతో పోలిస్తే అప్పట్లో పారితోషికాలు చాలా పరిమితమేనని భావించాలి.

సమరసింహారెడ్డి, నరసింహారెడ్డి సినిమాల తర్వాత కెరీర్‌లో హెచ్చుతగ్గులు వచ్చినా.. దర్శకుడు బోయపాటి శ్రీనుతో చేసిన సింహా, లెజెండ్ చిత్రాలు బాలయ్య మార్కెట్‌ను మళ్లీ నిలబెట్టాయి. బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన -సింహా- సమయంలో అతడి పారితోషికం 5 కోట్ల మార్కును తాకగా, -లెజెండ్- నాటికి అది రూ. 7 కోట్ల నుంచి రూ. 9 కోట్ల స్థాయికి చేరింది. ఈ విజయాలతో బాలకృష్ణ వ్యాపార పరిధి మరింత పెరిగింది.. ఆయన సినిమాలకు బాక్సాఫీస్ వద్ద ఉన్న డిమాండ్ స్పష్టమైంది.

అయితే ఇటీవల వచ్చిన -అఖండ- విజయం బాలయ్య కెరీర్‌లోనే అతిపెద్ద మలుపు. -అఖండ- చిత్రానికి 15 కోట్ల వరకు అందుకోగా.. అనంతరం వచ్చిన వీరసింహారెడ్డి, భగవంత్ కేసరి, డాకు మహారాజ్ వంటి బ్యాక్-టు-బ్యాక్ హిట్లు, బాబీ ప్రాజెక్ట్ నాటికి ఆయన మార్కెట్ రేటును 30 కోట్లకు చేర్చాయి. ఇక పాన్-ఇండియా స్థాయిలో రూపొందిన -అఖండ 2- కోసం ఆయన పారితోషికం 40 కోట్ల రేంజ్‌కు పెరగడం విశేషం.ఇప్పుడు కొరటాల శివ దర్శకత్వంలో రూపుదిద్దుకోనున్న పొలిటికల్ యాక్షన్ డ్రామా (చీదీఖ112) కోసం బాలకృష్ణ ఏకంగా 45 కోట్ల మేర పారితోషికం అందుకోనున్నట్లు ఫిలింనగర్ సమాచారం. ఇది ఆయన సుదీర్ఘ సినీ ప్రయాణంలో అందుకుంటున్న బిగ్గెస్ట్ చెక్. ఒకప్పుడు 1-2 కోట్లతో ప్రారంభమైన పారితోషికం గ్రాఫ్.. నేడు 45 కోట్లకు చేరుకోవడం ఎన్బీకే బాక్సాఫీస్ స్టామినాను నిరూపిస్తోంది. త్వరలోనే ఆయన రూ. 50 కోట్ల రెమ్యునరేషన్ క్లబ్‌లో చేరడం ఖాయమని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.మొత్తానికి -సమరసింహారెడ్డి- రోజుల నాటి పారితోషికంతో పోలిస్తే ఇప్పటి రేంజ్ దాదాపు 40 రెట్లకు పైగా పెరిగింది. వయసుతో సంబంధం లేకుండా వరుస విజయాలతో రీసెంట్ కాంబినేషన్లకు భారీ క్రేజ్ తీసుకువస్తూ రూ. 150 - 200 కోట్ల బడ్జెట్ సినిమాలను కూడా తన భుజస్కంధాలపై నడిపిస్తుండటమే బాలకృష్ణ పారితోషికం ఈ స్థాయిలో ఎగబాకడానికి ప్రధాన కారణం.



మాలవికా మోహనన్ పండుగ వేళ ధరించిన దుస్తుల్లో కాలాతీతమైన సాంప్రదాయ సొగసు వెల్లివిరిసింది

బ్రౌన్ రంగు దుస్తుల్లో మోనోక్రోమ్ ఫ్యాషన్‌కు కొత్త మెరుగులు దిద్దిన అయేషా ఖాన్


బుల్లి తెర ద్వారా వెండి తెరపై అడుగు పెట్టి సుదీర్ఘ కాలంగా రంగుల ప్రపంచంలో వినోదాన్ని అందిస్తున్న ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్. ఇండస్ట్రీలో అడుగు పెట్టి పుష్కర కాలం దాటింది. హిందీ సీరియల్స్, హిందీ సినిమాలతో ప్రేక్షకులను అలరించే ప్రయత్నం చేస్తూ వచ్చిన ముద్దుగుమ్మకు లక్కీగా తెలుగు సినిమా 'సీతారామం' సినిమాతో హిట్ పడింది. ఆ సినిమాలో చిన్న పాత్ర కోసం మృణాల్‌ను దర్శకుడు హను రాఘవపూడి కలవడం జరిగిందని, కానీ ఆమెను చూసిన తర్వాత సీతా మహాలక్ష్మి పాత్రకు మృణాల్ అయితేనే బాగుంటుందనే నమ్మకంతో ఆమెను నటింపజేశాడు. ఆయన నమ్మకంను మృణాల్ నిలుపుకుంది, అంతే కాకుండా సీతా మహాలక్ష్మి పాత్ర గురించి ఎప్పటికీ తెలుగు ప్రేక్షకులు చెప్పుకునే విధంగా నటించి, అందంగా కనిపించి మెప్పించింది. అందుకే సీతారామం సినిమా మృణాల్ కెరీర్ లో చాలా స్పెషల్ మూవీ అనడంలో సందేహం లేదు.

టాలీవుడ్‌లో మృణాల్ ఠాకూర్‌కి...

హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్‌కి టాలీవుడ్ నుంచి మంచి ఆఫర్లు వచ్చాయి. కానీ ఈమెకు బాలీవుడ్‌లో స్టార్‌డం దక్కించుకోవడం ఆసక్తి. అందుకే టాలీవుడ్‌లో వరుసగా సినిమాలు చేస్తూ కూడా బాలీవుడ్‌లో ఆఫర్ల కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉంటుంది. తెలుగులో డెకాయిట్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ అమ్మడికి మంచి హిట్ పడింది. అయితే తెలుగులో మరిన్ని సినిమాలు చేయడానికి మాత్రం ఈ అమ్మడు ఆసక్తి చూపడం లేదు అనేది కంప్లైంట్. బాలీవుడ్‌లో ఈ మధ్య కాలంలో రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమాల ఫలితంతో సంబంధం లేకుండా బ్యాక్ టు బ్యాక్ హిందీ సినిమాలు చేస్తూనే ఉంది. సౌత్ లో వస్తున్న ఆఫర్లను ఈమె సున్నితంగా తిరస్కరిస్తుందనే పుకార్లు వినిపిస్తున్నాయి. సౌత్ లో రాకా తర్వాత ఇప్పటి వరకు ఈమె కొత్త సినిమాను కమిట్ కాలేదు.

రాకా సినిమాలో మృణాల్...

అల్లు అర్జున్, అట్లీ కాంబోలో రూపొందుతున్న రాకా సినిమాలో ఈమె నటిస్తుందా అనే విషయంలో కూడా ఇప్పటి వరకు అధికారిక ప్రకటన రాలేదు. కొత్త సినిమాలు ఏమీ చేయక పోయినా ఎప్పటికప్పుడు అందమైన ఫోటోలు, వీడియోలతో మృణాల్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ఉంటుంది. తాజాగా మరోసారి అందాల ఫోటోలతో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఏకంగా 16 మిలియన్‌ల ఫాలోవర్స్ ను కలిగి ఉన్న ఈ అమ్మడు రెగ్యులర్‌గా స్కిన్ షో ఫోటోలు, అప్పుడప్పుడు ఇలాంటి అందమైన ఔట్ ఫిట్ ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. స్కిన్ షో ఫోటోలు షేర్ చేస్తే వైరల్ కావడం పెద్ద వింతేమి కాదు, కానీ ఇలా నిండుగా ఉన్న ఫోటోలను షేర్ చేసిన సమయంలో కూడా వైరల్ అయితే అప్పుడు వారి బ్యూటీకి ఒక విలువ ఉన్నట్టు అని కొందరు కామెంట్స్ చేస్తున్నారు.



రాయల్ ఫ్రేమ్‌లో పాలక్.. గ్లామర్ ఓకే కానీ..

ఇన్‌స్టాగ్రామ్‌లో మృణాల్ ఫోటో షూట్...

స్కిన్ షో చేయకున్నా మృణాల్ ఇలాంటి ఫోటో షూట్స్ తో కూడా చూపు తిప్పనివ్వదని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఒక బ్రాండ్ ప్రమోటింగ్ ఫోటో షూట్ అని తెలుస్తోంది. బెంగళూరు డైరీస్ అంటూ ఈ ఫోటోలకు ఇన్‌స్టాగ్రామ్ లో మృణాల్ కామెంట్ పెట్టడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఇక ఈ ఫోటోల్లో మృణాల్ ఠాకూర్ ను చూస్తూ ఉంటే కాస్త బరువు తగ్గినట్టు అనిపిస్తుందని, తన గత చిత్రాలతో పోల్చితే ఈ ఫోటోల్లో సన్నగా, చిక్కిందా అన్నట్లుగా కనిపిస్తుందని నెటిజన్స్ అంటున్నారు. మృణాల్ కెరీర్ ఆరంభంలో కాస్త ఎక్కువ బరువు కలిగి ఉండేది. అయినా కూడా చాలా అందంగా ఉండేది. అయితే కొందరు సన్నబడితే అందం తగ్గుతుందని అంటారు. కానీ మృణాల్ విషయంలో అది నిజం కాదని ఈ ఫోటోలు చూస్తే అర్థం అవుతుంది. చక్కనమ్మ చిక్కినా అందమే అన్నట్లుగా ఈ ఫోటోలకు మృణాల్ అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. ఈ ఫోటోలకు తెలుగు అభిమానులు తెలుగులో సినిమా ఎప్పుడు అంటూ కామెంట్స్ చేస్తున్నారు. మరి మృణాల్ సమాధానం ఏంటో మరి...!



PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com